ఇద్దరు వైద్యులు కలెక్టర్‌కు సరెండర్

వార్తకు స్పందన

తొట్టంబేడు, జనవరి 24 ప్రభాతవార్త

తొట్టంబేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఇద్దరు వైద్యులు డాక్టర్ రమేష్, డాక్టర్ ప్రవీణ్‌లను జిల్లా కలెక్టర్‌కు సరెండర్ చేసినట్లు సమాచారం అందింది. ఈమేరకు మంగళవారం కార్యాలయానికి ఉత్తర్వులు అందాయి. వార్త పత్రికలో ఈనెల 21వతేదీన 'విధులు మాకు వద్దు.. మందే మాకు ముద్దు" అన్న శీర్షికన ఇద్దరు వైద్యులు మందుకొడుతూ వార్త ప్రచురితం కావడంతో విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ దీనిపై విచారణకు డిఎంహెచ్ఓ డాక్టర్ శ్రీహరిని ఆదేశించారు. దీంతో ఆయన పిహెచ్‌సికి చేరుకుని విచారించగా ఆరోగ్య కేంద్రానికి విచ్చేసిన డిఎంహెచ్ఓ సమక్షంలో ఈనెల 22వతేదీన వార్త దినపత్రికలో ' డిఎంహెచ్ఓ విచారణలోను అదేసీన్ రిపీట్!" అన్న శీర్షికతో వార్త వెలువడింది. దీంతో మంగళవారం డిఎంహెచ్ఓ ఇద్దరు వైద్యులను జిల్లా కలెక్టర్‌కు సరెండర్ చేసినట్లు సమాచారం.

ఉద్యోగుల వార్షిక క్రీడలకు విస్తృత ఏర్పాట్లు

తిరుపతి,జనవరి 24ప్రభాతవార్త: టిటిడి ఉద్యోగుల వార్షిక క్రీడలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సిద్ధంచేస్తున్నట్లు జెఇఓ సదాభార్గవి తెలిపారు. మంగళవారం ఎస్వీహైస్కూల్ మైదానాన్ని ఆమె అధికారులతో కలసి పరిశీలించారు. ఫిబ్రవరి 2నుంచి 18వరకు జరగనున్న ఈ క్రీడల పోటీల్లో పాల్గొనే ఉద్యోగులైన క్రీడాకారులకు తాగునీరు,అల్పాహారం, భోజనం, మరుగుదొడ్లు, పార్కింగ్ ఏర్పాట్లపై జెఇఓ సమీక్షించారు.

నారా లోకేష్ పాదయాత్రకు షరతులతో కూడిన అనుమతి

– ఎస్పీ రిశాంత్‌రెడ్డి

చిత్తూరు, జనవరి 24 ప్రభాతవార్త: జాతీయ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ నారా లోకేష్ ఈ నెల 27 నుండి కుప్పం నుండి ప్రారంభించనున్న పాదయాత్రకు షరతులతో కూడిన అనుమతి మంజూరు చేయడం జరిగిందని ఎస్పీ రిశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిఎ మనోహర్ నారా లోకేష్ కుప్పంలో ఈ నెల 27వ తేదీ నుండి చేపట్టనున్న పాదయాత్ర, కుప్పంలో నిర్వహించే బహిరంగ సభకు సంబంధించి పలమనేరు డిఎస్పీ సుధాకర్‌రెడ్డిని కలిసి విన్నవించడం జరిగిందన్నారు. ఈ వినతిని పరిశీలించిన పలమనేరు డిఎస్పీ సుధాకర్‌రెడ్డి పాదయాత్రకు కొన్ని షరతులతో కూడిన అనుమతిని మంజూరు చేయడం జరిగిందన్నారు. అయితే సోషల్ మీడియాలో నారా లోకేష్ పాదయాత్రకు పోలీసులు అనుమతి ఇవ్వలేదని దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. పాదయాత్రలో ప్రజలు, వాహనదారులు, ఎమర్జెన్సీ సర్వీసెస్ వాహనాల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కల్పించకూడదని, బహిరంగ సభల సమయాలకు కట్టుబడి వుండాలని, ప్రభుత్వ, ప్రైవటు ఆస్తులకు ఎలాంటి నష్టం కల్గించకూడదని, రోడ్లపై ఎలాంటి సమావేశాలు నిర్వహించరాదని ఎస్పీ పేర్కొన్నారు. అలాగే ఆరోగ్య, అత్యవసర పరిస్థితులను నిర్వహించడానికి నిర్వాహకులు సమావేశ స్థలంలో ప్రథమ చికిత్స, వైద్య పరికరాలను అంబులెన్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ఎదైనా అత్యవసర పరిస్థితిని ఎదుర్కొవడానికి సమావేశ స్థలం వద్ద అగ్నిమాపక యంత్రం వుంచాలన్నారు. ఈ సందర్భంగా ఎలాంటి టపాకాయలు పేల్చడం చేయకూడదన్నారు. కార్యకర్తలు, సమావేశంలో పాల్గొనే వారు సమావేశంలోకి ఎలాంటి మరణాయు ధాలు తీసుకెళ్ళకుండా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలన్నారు. నిర్వాహకులు విధుల్లో వున్నపోలీసులుఎప్పటికప్పుడుఇచ్చే ఆదేశాలను పాటించాల్సి వుంటుందన్నారు. అలాగే శాంతిభద్రతలు, ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలని ఈ నిబంధనలకు లోబడి పాదయాత్ర చేసుకోవాలని ఎస్పీ రిశాంత్‌రెడ్డి తెలిపారు.

పేద ప్రజల గుండెల్లో సిఎం వైఎస్ జగన్

– డిప్యుటీ సిఎం నారాయణస్వామి

పాలసముద్రం, జనవరి 24 ప్రభాతవార్త: పేద ప్రజల గుండెల్లో సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గూడు కట్టుకొని వున్నారని డిప్యుటీ సిఎం నారాయణస్వామి పేర్కొన్నారు. పాలసముద్రం మండలం వెంగళ్రాజుకుప్పం పంచాయతీ పరిధిలో మంగళవారం జరిగిన రెండవ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యుటీ సిఎం నారాయణస్వామి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యుటీ సిఎం మాట్లాడుతూ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హత వున్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. రాష్ట్రంలో మరో 30 సంవత్సరాల పాటు సిఎంగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వుంటారని ఆయన జోస్యం చెప్పారు. రాష్ట్రంలో రోడ్ల మరమ్మత్తుకు సిఎం చర్యలు చేపట్టడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. పేదరికంలో ఎవరు వుండకూడదని సిఎం వైఎస్ జగన్ ఆశయం అన్నారు. త్వరలో సచివాలయాల్లోని ఖాళీల భర్తీకి సిఎం వైఎస్ జగన్ చర్యలు చేపట్టారని మూడు నెలల్లో ఈ నియామక ప్రక్రియ పూర్తి చేయడానికి కసరత్తు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శివప్రకాష్‌రాజు, వైకాపా మండల కన్వీనర్ తులసీయాదవ్, వైస్ఎంపిపి శేఖర్‌మందడి, జడ్పీటిసీ అన్బుగలన్, సీనియర్ నాయకులు ఇందిరమ్మ, సుబ్రమణ్యంరెడ్డి, సర్పంచ్ లిల్లీ, ఎంపిటిసీ పుష్ప, తహసిల్దారు బాబు, ఎంపిడిఓ విద్యావతి, ఎస్ఐ సురేష్, పంచాయతీ కార్యదర్శులు, విఆర్ఓలు, వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే ఉద్యమించక తప్పదు:

పదవులు తామకేమి కొత్త కాదు

ఎపిఎన్‌జిఓ సంఘాధ్యక్షుడు బండి శ్రీనివాసులు

శ్రీకాళహస్తి,జనవరి 24 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే ఉద్యమించక తప్పదని రాష్ట్ర ఎన్‌జిఓ అధ్యక్షుడు బండి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం రాత్రి శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి వచ్చిన ఆయన ఇక్కడి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ సంఘాలు తమ హక్కుల సాధన కోసం చట్టానికి లోబడి పని చేయాలి తప్ప రాజకీయ ముసుగుల్లో పని చేయరాదన్నారు. ఉద్యోగుల డిమాండ్లకు సంబంధించి దశల వారిగా ప్రభుత్వంపై వత్తిడి తెస్తున్నామన్నారు. ఎపిఎన్‌జిఓ సంఘంలో 108 సంఘాలున్నాయన్నారు. ప్రభుత్వం ఉద్యోగుల బాధలను పరిగణలోకి తీసుకొని పరిష్కరించకుంటే కమిటి సమావేశం అయి కార్యచరణ రూపొందిస్తామన్నారు. ఉద్యోగ సంఘాలు రాజకీయాలకు అతీతంగా పని చేయాలని డిమాండ్ చేసారు. ఇటీవల ఉద్యోగ సంఘాలకు సంబంధించిన సూర్యనారాయణ గవర్నర్‌ను కలవటాన్ని తప్పు పట్టారు. సమస్యల పరిష్కారానికి తామూ కూడా ఉద్యమిస్తున్నామన్నారు. ప్రభుత్వంపై వత్తిడి తెస్తున్నామన్నారు. సమస్యలు ఒక్క రాత్రిలో పరిష్కారం కాదన్నారు.ఏ సమస్య అయినా పరిష్కరించాల్సింది ప్రభుత్వమే కానీ రాజ్యాంగానికి వ్యతిరేకంగా గవర్నర్‌ను కలటం తగదంటున్నాము. గవర్నర్‌ను కాదంటే రాష్ట్రపతిని ఆయన్ను కాదనుకుంటే భారతప్రధానిని కలుసుకోవచ్చు కానీ పరిష్కరించాల్సింది ప్రభుత్వ ప్రధాన కార్యదర్శియే అనే విషయాన్ని విస్మరించరాదన్నారు.పేపర్ సంఘాలు ఏదో ఉద్యమిస్తుంటాయి. వాటిని గురించి పరిగణలోకి తీసుకోవాల్సిన అవసరం లేదన్నారు.

సంక్షోభం మంచిదే కానీ సంక్షోభం కల్పించటం తగదు:

రాష్ట్ర ప్రభుత్వం వివిధ వర్గాలకు సంక్షేమ పథకాలను అమలు చేయటం హర్షించదగిన విషయమే. అయితే వారి సంక్షేమంతో పాటు ఉద్యోగుల సంక్షేమాన్ని సంక్షోభంగా మార్చవద్దని బండి శ్రీనివాసులు కోరారు.సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసే క్షేత్ర స్థాయి ఉద్యోగుల బాధలను పరిగణలోకి తీసుకోవాలన్నారు.తమ హక్కుల సాధన కోసం ప్రభుత్వం మొండివైఖరి ప్రదర్శిస్తే సహించేది లేదన్నారు. తమకు చట్టం కల్పించిన హక్కులను కాలరాస్తామంటే సహించేది లేదన్నారు.ప్రభుత్వోద్యోగులకు ప్రభుత్వం రూ.12వేల కోట్లు బకాయిలు పేరుకుపోయాయన్నారు.ఉద్యోగులకు ప్రభుత్వం ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే ఉద్యమించక తప్పదని బండి శ్రీనివాసులు వివరించారు. విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు ఎపి పంచాయతీరాజ్ మినిస్టీరియల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మరియు శ్రీకాళహస్తి ఎన్జీవో తాలూకా అధ్యక్షుడు చెంచురత్నం యాదవ్, తిరుపతి అధ్యక్షుడు సురేష్, కార్యదర్శి నాగరాజు, మహేష్,సుబ్బారెడ్డి,బాలాజి, వరప్రసాద్,సుభాకర్‌రెడ్డి,రవిశంకర్ తదితరులున్నారు.

"యువగళం" కు ముందే

వెంకన్న ఆశీస్సులకు నేడు తిరుమలకు లోకేష్

తిరుమల,జనవరి 24ప్రభాతవార్తప్రతినిధి: తెలుగుదేశం జాతీయ కార్యదర్శి,యువనేత నారాలోకేష్ ఎల్లుండినుంచి చేపట్టనున్న "యువగళం" పాదయాత్ర జయప్రదం చేయాలని వేడుకుంటూ ,ఇష్టదైవమ్ ఏడుకొండల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థమ్ నేటిరాత్రికి తిరుమలకు వస్తున్నారు. రాత్రికి తిరుమలలోనే బసచేయనున్న ఆయన 26న గురువారం ఉదయం స్వామివారిని దర్శించుకుని, ఆశీస్సులందుకోనున్నారు. 27వతేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా యువగళం పేరుతో చేపట్టనున్న పాదయాత్ర విజయవంతం కావాలని, ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించే శక్తిని ప్రసాదించాలని వేడుకోనున్నారు. తిరుమల,తిరుపతిలో టిడిపి నాయకులు విస్తృత ఏర్పాట్లు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. 27,28,29 మూడురోజులు చిత్తూరుజిల్లాలోని కుప్పం పర్యటనలో ఉండనున్న లోకేష్ తోబాటు మాజీమంత్రి అమరనాథరెడ్డి, చిత్తూరు పార్లమెంట్ కమిటీ అధ్యక్షుడు.చంద్రగిరి ఇన్‌ఛార్జి పులివర్తి నాని, పలువురు నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు వెంట నడవనున్నారు.

లడ్డూకౌంటర్‌లో రూ.2లక్షల నగదు చోరీ

తిరుమల,జనవరి 24ప్రభాతవార్తప్రతినిధి:

టిటిడి చరిత్రలో ఎన్నడూ జరగని రీతిలో ఏకంగా పాత దొంగ లడ్డూకౌంటర్ 36లో 2లక్షల రూపాయలు నగదు చోరీ చేసుకెళ్ళాడు.కొత్తగా విధుల్లో చేరిన కార్పొరేషన్ సిబ్బందిలో ఒకరు చిన్నపాటి నిర్లక్ష్యంతో తన షిఫ్టులో లడ్డూలు విక్రయించగా వచ్చిన నగదు 2లక్షల రూపాయలు చోరీకి గురైంది. దీనిపై విజిలెన్స్ అధికారులు తిరుమల 1టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిసిటివి పుటేజీల ఆధారంగా కౌంటర్‌లోంచినగదును పాతనేరస్తుడు సీతాపతి చోరీచేసుకెళ్ళినట్లు కనుగొన్నారు. దర్యాప్తు మొదలైంది.

మత్స్యకారులు లబ్ధిపొందేలా చర్యలు

– జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్

చిత్తూరు, జనవరి 24 ప్రభాతవార్త: జిల్లాలో మంచి వర్షాలు నమోదు కావడంతో మత్స్య సంపద వృద్ధి చెందిందని, చేపలను ఆహారంగా తీసుకొంటే ఆరోగ్యానికి మంచిదని, ఈ విషయంపై ప్రజల్లో మరింత అవగాహన పెంచాలని జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం జెసి వెంకటేశ్వర్ మత్స్యశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జెసి మాట్లాడుతూ ప్రధానమంత్రి మత్స్యయోజన పథకం ద్వారా మత్స్యకారులు లబ్ధిపొందేలా చూడాలన్నారు. చేపల పెంపకంను ప్రోత్సహించడానికి లక్ష నుండి కోటి రూపాయల వరకు రుణ సహాయం అందుబాటులోకి వచ్చిందన్నారు. ఈ రుణంలో 40 నుండి 60 శాతం రాయితీ వుంటుందన్నారు. మత్స్యకారులకు ప్రభుత్వం అందించే రాయితీలపై క్షేత్ర స్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. చేపలు అమ్మకాలు జరిగే చిరు వ్యాపారులకు లాభదాయంగా వుండేలా చూడాలన్నారు. అలాగే మహిళా సంఘాలకు రుణాలు మంజూరు చేసి తద్వారా మరింత ఎక్కువ మందికి ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఫిషరీస్ డిడి రవికుమార్‌రెడ్డి, జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, డిఆర్‌డిఎ పిడి డిఎంకె తులసీ, వ్యవసాయ అధికారిణి శ్రీదేవి, లీడ్ బ్యాంక్ మేనేజర్ శేషగిరిరావు, ఇరిగేషన్ ఎస్ఇ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుండి పక్కాగా ప్లాస్టిక్ నిషేధం

– మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ

చిత్తూరు, జనవరి 24 ప్రభాతవార్త: జాతీయ హరిత ట్రిబ్యూనల్ మార్గదర్శకాలు, ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం నుండి ప్లాస్టిక్ ఫ్లెక్సీలు పూర్తిగా నిషేధిస్తున్నట్లు కమీషనర్ డాక్టర్ జె.అరుణ పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం కమీషనర్ డాక్టర్ జె.అరుణ వార్డు కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కమీషనర్ మాట్లాడుతూ చిత్తూరు నగరంలో గురువారం నుండి ప్లాస్టిక్ ఫ్లెక్సీల తయారీ, ఏర్పాటు చేయడాన్ని పూర్తిగా నిషేధిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ విషయంపై వార్డు కార్యదర్శులు ఫ్లెక్సీల తయారీ దారులు, ప్రింటర్ల యాజమానులు, వ్యాపారస్తులు, స్థానిక రాజకీయ నాయకులకు అవగాహన కల్పించాలన్నారు. గురువారం నుండి నగర పరిధిలో ఎక్కడైనా సింగిల్ యూస్ ప్లాస్టిక్ వినియోగించినా, ప్లాస్టిక్ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినా సత్వరం తొలగించడంతో పాటు ఏర్పాటు చేసిన వారి నుండి అపరాధ రుసుం వసూలు చేయాలన్నారు. అలాగే నగర పరిధిలో డెంగ్యూ కేసులు పెరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఇళ్ళ నిర్మాణాలను వేగవంతం చేయాలని, ఆస్తి పన్ను నిర్ధేశిత లక్ష్యాలను చేపట్టాలని ఆదేశించారు. అంతకు ముందు సింగిల్ యూస్ ప్లాస్టిక్ వినియోగించరాదని నగరంలోని హోటల్స్, రెస్టారెంట్ యాజమానులకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వినియోగిస్తే అపరాధ రుసుం వసూలు చేయడంతో పాటు చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్, ఎసిపి రామకృష్ణుడు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

శివయ్య సేవలో ఉద్యోగ సంఘ నాయకుడు

శ్రీకాళహస్తి,జనవరి 24 ప్రభాతవార్త

దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో రాష్ట్ర ఎపిఎన్‌జిఓ సంఘ నాయకుడు బండి శ్రీనివాసులు పూజలు చేయించుకున్నారు.వారికి ఎపిపంచాయతీరాజ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మరియు శ్రీకాళహస్తి ఎన్‌జిఓ అధ్యక్షుడు చెంచురత్నంయాదవ్ సారధ్యంలో భారీ ఎత్తున స్వాగతం పలికారు.స్వామి అమ్మవార్లను దర్శించుకున్న ఆయనకు గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు.ఆయనకు దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో ఎసి మల్లికార్జున్ ప్రసాద్ వేదపండితులతో స్వాగతం పలికారు. ఏర్పాట్లను ఆలయ ఎఇఓ సతీష్‌మాలిక్, ఆలయ పిఆర్ఓలు శ్రీనాథ్, నారాయణస్వామి, యుగంధర్, టెంపుల్ ఇన్స్పెక్టర్ హరియాదవ్‌లు పర్యవేక్షించారు.

ఇద్దరు అనుమానితుల అరెస్టు

శ్రీకాళహస్తి రూరల్, జనవరి 24 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మండలంలోని ఇసిఎల్ పరిశ్రమలో దొంగతనానికి పాల్పడుతున్నట్లు అనుమానించిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు సిఐ అజయ్‌కుమార్ మంగళవారం తెలిపారు. గత కొంత కాలంగా పరిశ్రమ సమీపంలో కమ్మి, డస్టు వేస్తేజి ఉండేది. అయితే గత కొంత కాలంగా పరిశ్రమ నుంచి వస్తువులు చోరీ జరుగుతున్నట్లు కంపెనీ నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం అనుమానితులు శ్రీకాళహస్తి పట్టణంలోని కొండమిట్టకు చెందిన కళ్యాణ్, బిపి అగ్రహారినికి చెందిన మునిరెడ్డిలను అదుపులో తీసుకొని విచారిస్తున్నట్లు వివరించారు. కేసు నమోదు చేసినట్లు సిఐ వివరించారు.

ఉష్ణోగ్రతలు

23/1/2023

- తిరుపతి 27 డిగ్రీలు
- చిత్తూరు 30 డిగ్రీలు
- మదనపల్లి 23 డిగ్రీలు
- శ్రీకాళహస్తి 29 డిగ్రీలు
- వెంకటగిరి 30 డిగ్రీలు
- గూడూరు 30 డిగ్రీలు

బంగారం ధరలు

23/1/2023

22 క్యారెట్స్ 1గ్రాము రూ. 5, 235

24క్యారెట్స్ 1గ్రాము రూ.5,711

కోడిగ్రుడ్డు ధరలు

23/1/2023

కోడిగ్రుడ్డు :రూ.6.00

1 డజను: రూ.72.00

నారాయణపురంలో దాడి

శ్రీకాళహస్తిరూరల్, జనవరి 24 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మండలంలోని నారాయణ పురం గ్రామానికి చెందిన వెంకటస్వామి రెడ్డి గ్రామానికి చెందిన పాండురెడ్డి ఇంటిపై పాతకక్షలతో దాడి చేసినట్లు ఫిర్యాదు అందిందని ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సిఐ అజయ్‌కుమార్ మంగళవారం తెలిపారు.వెంకటస్వామి రెడ్డిని అరెస్టు చేసినట్లు వివరించారు.

జాతీయ రహదారుల పనులు వేగవంతం

– జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్

చిత్తూరు, జనవరి 24 ప్రభాతవార్త: జిల్లాలో జరుగుతున్న జాతీయ రహదారుల పనులను మరింత వేగవంతం చేసి పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో మంగళవారం జెసి జాతీయ రహదారుల పనులపై కలిసిన పిడి కార్తీక్‌రెడ్డి తదితరులతో జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జెసి మాట్లాడుతూ జిల్లాలో తచ్చూరు రహదారి నిర్మాణానికి సంబంధించి భూసేకరణ పనులను పూర్తి చేయడం జరిగిందన్నారు. ఇందుకు సంబంధించిన పనులను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. అలాగే బెంగళూరు-చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవే పనులు మరింత వేగవంతం చేస్తే బాగుంటుందన్నారు. ఎదైనా సమస్యలు వుంటే సంబంధిత రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకొంటారన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓ డాక్టర్ రేణుక తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదిని పెట్టుకోని వారికి లీగల్ సర్వీసెస్ ఆథారిటీ ద్వారా న్యాయం

చిత్తూరు, జనవరి 24 ప్రభాతవార్త: కేసులకు సంబంధించి న్యాయవాదిని పెట్టుకోలేని స్థోమత లేనివారు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా న్యాయం పొందవచ్చునని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఐ.కరుణకుమార్ పేర్కొన్నారు. ఇరువారంలోని విభిన్న ప్రతిభావంతుల కాలనీలో మంగళవారం కార్మిక శాఖ అసిస్టెంట్ కమీషనర్ ఓంకార్, జాతీయ నిర్మాణ శిక్షణ సంస్థ ఎడి విజయ్‌ప్రతాప్‌లతో కలిసి సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్ ఇశ్రామ్ కార్డుల పంపిణీ, కార్డుల నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మాట్లాడుతూ ప్రతి స్త్రీ ఉచిత న్యాయ సేవలు పొందవచ్చునన్నారు. అలాగే ప్రజలు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచితంగా న్యాయ సేవలు పొందవచ్చునన్నారు.అసిస్టెంట్ లేబర్ కమీషనర్ ఓంకార్ మాట్లాడుతూ కార్మికుల చట్టం 1996, ఎపి నిబంధనలు 1999 భవన, ఇతర రంగాల్లో పనిచేయు కార్మికుల సంక్షేమం కోసం ఒక చట్టం తీసుకురావడం జరిగిందన్నారు. 18-59 సంవత్సరాల మధ్య వయస్సు లోపు వున్న భవన, ఇతర నిర్మాణ రంగాల్లో పనిచేసే కార్మికులు 110 రూపాయలు రుసుము చెల్లించి వయస్సు ధృవీకరణ, రేషన్‌కార్డు, ఓటరు కార్డు, ఆధార్‌కార్డు, స్కూల్ సర్టిఫికేట్ జెరాక్స్ కాపీలను జత చేసి కార్మికశాఖ అధికారిచే ఐదు సంవత్సరాలకు ఒకసారి నమోదు చేసుకోవాలన్నారు. ఆ తరువాత 60 రూపాయలు చెల్లించి 5 సంవత్సరాలకు ఒకసారి రెన్యువల్ చేసుకోవచ్చునన్నారు.

కార్మికులు పనిచేసే ప్రదేశంలో పనిచేస్తూ మృతి చెందితే వైఎస్ఆర్ బీమా ద్వారా 5 లక్షలరూపాయలు, 50 శాతం అంగవైకల్యం కలిగితే ఒక లక్ష రూపాయలు, సాధారణ మరణంకు 60 వేల రూపాయలు, ప్రసూతి సహాయం కింద 20 వేల రూపాయలు, దహనసంస్కారాలకు20వేలరూపాయలు,తాత్కాలిక అంగవైకల్యం(ఆసుపత్రిఖర్చులకు) రోజుకు 300 రూపాయలు ఇవ్వడం జరుగుతుందన్నారు. జాతీయ నిర్మాణ శిక్షణ సంస్థ ఎడి విజయ్‌ప్రతాప్, స్థానిక కార్పొరేటర్ అశోక్, అసిస్టెంట్ లేబర్ కమీషనర్ జగదీష్‌బాబు, సర్కిల్ ఇన్స్పెక్టర్ భాస్కర్, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజర్ గుణశేఖర్‌రెడ్డి,కార్మికశాఖసీనియర్అసిస్టెంట్ఎలిజిబెత్,సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

అన్నయ్యా ... అక్కా చెల్లెమ్మలకు ఆసరా ఎన్నడు ?

రుణ మాఫీ కోసం మహిళల ఎదురు చూపు

కోట, జనవరి 24 ప్రభాతవార్త

మహిళా సంఘాలు 2019 ఏప్రిల్ 11 వ తేదీకి ముందు బ్యాంకుల ద్వారా పొందిన రుణాలను నాలుగు విడతలుగా మాఫీ చేసేందుకు వైఎస్ఆర్ ఆసరా పదకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈపథకం కింది మహిళల రుణాల మాఫీకి మెప్మా అధికారులు బయోమెట్రిక్‌లో సంతకాలు నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేశారు. ఇక రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి బటన్ నొక్కడం కోసం అక్క చెల్లెమ్మలు ఎదురు చూస్తున్నారు.అధికారంలోకి వస్తే డ్వాక్రా మహిళల రుణాలను సంపూర్ణంగా మాఫీ చేస్తామని పాదయాత్ర సమయంలో ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. అయితే అధికారం చేపట్టిన తర్వాత ఒక్కసారి కాదు నాలుగు దశల్లో మొత్తం రుణాన్ని మాఫీ చేస్తామని ప్రకటించారు. ఈ పథకానికి వైఎస్సార్ ఆసరాగా నామకరణం చేశారు. 2021 నాటికి రెండు దశలు పూర్తికాగా, మూడో దశలో ఆసరా పథకం నిలిచిపోయింది. గత ఏడాది అక్టోబర్‌లో ఈ పథకాన్ని అమలు చేయాల్సి ఉంది. ప్రభుత్వం ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కోవడంతో మూడేళ్లుగా వాయిదా పడుతూ వస్తోంది. 2023 జనవరిలో సంక్రాంతి నాటికి ఆసరా అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ నెల 20వ తేదీ దాటిని దీనిపై కసరత్తు ప్రారంభం కాలేదు. ఫలితంగా మహిళలు రుణమాఫీ కోసం నిరీక్షించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. మరోపక్క బ్యాంకర్ల నుంచి రుణాలు చెల్లించాలంటూ ఒత్తిడి పెరగడంతో మహిళలు ఆందోళన చెందుతున్నారు. ఆసరా పథకం అమలుకు గత అక్టోబర్‌లో వైఎస్సార్ క్రాంతి పథం అధికారులు మహిళల నుంచి బయోమెట్రిక్ తీసుకున్నారు. డ్వాక్రా సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళలు సజీవంగా ఉన్నారా లేదా అన్నది నిర్ధారించేందుకు ప్రభుత్వం ఈ ప్రక్రియ చేపట్టి పూర్తి చేసింది. మూడో విడత మాఫీ కోసం మహిళలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

దుర్గానగర్‌కాలనీలోని ఇంట్లో దొంగతనం

చిత్తూరు, జనవరి 24 ప్రభాతవార్త:

చిత్తూరు టుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దుర్గానగర్ కాలనీలోని ఓ ఇంట్లో సోమవారం రాత్రి దొంగలు పడి దోచుకొన్నారు. ఇంట్లో ఎవరు లేని సమయం చూసిన దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి విలువైన వస్తువులు పట్టుకెళ్ళారు. ఇంట్లో దొంగతనం జరిగిన విషయం తెలిసిన యాజమాని సందీప్‌కుమార్ టుటౌన్ ఎస్ఐ మల్లికార్జున్‌ను కలిసి ఫిర్యాదు చేశాడు. సందీప్‌కుమార్ తండ్రి సదాశివరెడ్డికి గత కొంతకాలంగా అనారోగ్యం వుండటంతో బెంగళూరులోని ఓ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్చారు. సందీప్‌కుమార్ తిరుపతిలోని ఓ కళాశాలలో ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహిస్తుండటంతో గత కొంతకాలంగా ఇంట్లో ఎవరు వుండటం లేదు. ఇంటికి త

ప్రజలు.. యువతకు భరోసా కల్పించేందుకే లోకేష్ పాదయాత్ర -మాజీ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి

కుప్పంరూరల్, జనవరి 24 ప్రభాతవార్త

తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఈనెల 27నుంచి కుప్పంలో ప్రారంభించనున్న యువగళం పాదయాత్ర పోస్టర్లను మంగళవారం కుప్పంలో మాజీ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజలు, యువతకు భరోసా కల్పించేందుకే నారా లోకేష్ 400రోజుల పాటు 4వేల కిలోమీటర్ల మేర సుదీర్ఘ పాదయాత్రకు కుప్పం నుంచి శ్రీకారం చుట్టబోతున్నారన్నారు. ఇప్పటికే ప్రజలు తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు సభలకు బ్రహ్మరథం పడుతున్నారని, యువనేత నారా లోకేష్ పాదయాత్ర రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చరిత్ర సృష్టించబోతుందన్నారు. రాష్ట్రంలో భావితరాలకు నారా లోకేష్ నాయకుడుగా ఎదుగుతున్నారన్నారు. ఈ పాదయాత్ర విజయవంతం కావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం , మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, నేతలు డా॥ వెంకటేష్, సత్యేంద్రశేఖర్, శాంతారాం, మణి, జాకీర్, అన్సర్, పిఎస్ సతీష్, జెకె సంతోష్, నరేష్, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా నారా లోకేష్ బహిరంగ సభ వేదిక ఏర్పాట్లు

కుప్పం, జనవరి 24 ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఈనెల 27న కుప్పంలో యువగళం పాదయాత్ర ప్రారంభించనున్న విషయం విదితమే. అదేరోజు స్థానిక హెచ్‌పి పెట్రోల్ బంక్ వెనుక భాగంలో ఉన్న ప్రైవేట్ స్థలంలో బహిరంగసభలో పాల్గొని ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు. దీంతో తెలుగుదేశం పార్టీ శ్రేణులు బహిరంగసభ ప్రాంగణం వద్ద వేదిక, బారికేడ్లు, ప్రజలు కూర్చునేందుకు ఏర్పాటు, వాహనాల పార్కింగ్ తదితర ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. సుమారు వంద అడుగుల వెడల్పు, అరవై అడుగుల పొడవుతో బహిరంగసభ వేదికను ఏర్పాటుచేస్తున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలనుంచి తెదేపా నేతలు, కార్యకర్తలు, అభిమానులు తరలిరానుండడంతో ఎక్కడా పార్కింగ్ సమస్యలు తలెత్తకుండా స్థానిక నేతలు దగ్గరుండి ఏర్పాటుచేస్తున్నారు. మాజీ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు పులివర్తినాని సలహాలు, సూచనలతో బహిరంగసభ వేదిక వద్ద ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు ఏర్పాట్లను చేపడుతున్నారు.

అభివృద్ధి..సంక్షేమం సిఎం జగనన్నతోనే సాధ్యం - ఎమ్మెల్సీ భరత్

శాంతిపురం, జనవరి 24 ప్రభాతవార్త

రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం సిఎం జగనన్నతోనే సాధ్యమని చిత్తూరు ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు కెఆర్‌జె భరత్ పేర్కొన్నారు. మంగళవారం కర్లగట్ట, చిన్న కర్లగట్ట గ్రామాల్లో గడప గడపకు మీ ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించి ప్రజలకు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేసిన ఘనత సిఎం జగనన్నకే దక్కుతుందన్నారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అర్హులకు అందిస్తామన్నారు. కార్యక్రమంలో జడ్పీటిసి శ్రీనివాసులు, ఎంపిపి వసుంధర కోదండరెడ్డి, మండల కన్వీనర్ దండపాణి, స్థానిక నేతలు పాల్గొన్నారు.

అన్నదానం షెడ్‌ను తొలగించడం దారుణం - జెపి ఫౌండేషన్ ఛైర్మన్ జయప్రకాష్

శాంతిపురం, జనవరి 24 ప్రభాతవార్త

మండల కేంద్రమైన శాంతిపురంలో ఎన్టీఆర్ వర్ధంతి నాడు ప్రారంభించిన ఉచిత అన్నదానం షెడ్‌ను తొలగించడం దారుణమని జెపి వెల్‌నెస్ ఫౌండేషన్ ఛైర్మన్ జయప్రకాష్ పేర్కొన్నారు. తాను నిత్యం ప్రజలకు అన్నదానం చేయాలని తన సొంత నిధులతో కార్యక్రమం చేపట్టానని అయితే కొంతమంది అక్కడున్న షెడ్డును తొలగించి ఆటోస్టాండ్ అవసరమని చెప్పడం బాధాకరమన్నారు. ఈవిషయంను పార్టీ అధినేత చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్తామన్నారు. అయితే షెడ్ తొలగించిన వ్యక్తులు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్నదానం జరుపుకోవాలని సూచించామన్నారు. ఆటో కార్మికులను అక్కడనుంచి పంపించడం దారుణమన్నారు.

డిఎస్పీచే సభా ప్రాంగణం పరిశీలన

కుప్పంరూరల్, జనవరి 24 ప్రభాతవార్త

ఈనెల 27న కుప్పంలో తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నిర్వహించనున్న బహిరంగ సభ ప్రాంగణాన్ని మంగళవారం పలమనేరు డిఎస్పీ సుధాకర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా పార్కింగ్, ప్రజలకు సీటింగ్ తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అర్బన్ సిఐ శ్రీధర్, రూరల్ సిఐ రియాజ్ అహ్మద్, ఎస్సైలు శివకుమార్, రామాంజనేయులు పాల్గొన్నారు.

మాజీ మంత్రికి ఘన నివాళ్ళు

గంగవరం, జనవరి 24, ప్రభాతవార్త :

రాష్ట్ర మాజీ మంత్రి ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి 29వ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. మంగళవారం మండలంలోని మేలుమాయి గ్రామ సమీపంలోని సంఘం డైరీలో డైరీ రీజనల్ మేనేజర్ డా వైపి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో డైరీ సబ్బందితో కలిసి మాజీ మంత్రి,సంఘం డైరీ మాజీ ఛైర్మన్ వీరయ్య చౌదరి చిత్ర పటానికి పూలు మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరయ్య చౌదరి రాష్ట్ర రెవెన్యూశాఖా మంత్రిగా,సంఘం డైరీ ఛైర్మన్‌గా,ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాడి పరిశ్రమాభివృద్ధి సమాఖ్య ఛైర్మన్‌గా ఎన్నికై గ్రామీణ ప్రాంతాల్లో పాలు సొసైటీ కేంద్రాలను ఏర్పాటు చేసి పాడి రైతుల జీవన ప్రమాణాలను పెంపొందించి ఎనలేని సేవలందించి పాల వీరయ్యగా పేరుగాంచిన మహనీయుడని ఆయన కొనియాడారు. అలాగే పశుసంతతి అభివృద్ధి కోసం కృత్రిమ వీర్య సేకరణ కేంద్రాన్ని,వీర్యదారణ ట్రైనింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఎంతో మంది నిరుద్యోగ యువతి,యువకులకు ఉపాది అవకాశాలు కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో డైరీ మేనేజర్ అమ్మినేని రవి,సబ్బంది రాజ్‌కుమార్,సురేంద్ర,మహేష్, చంద్రశేఖర్,ప్రభాకర్ రవి,రామకోటిరెడ్డి, శకుంతలమ్మ,జ్యోష్న తదితరులు పాల్గొన్నారు.

గణనాధుని సేవలో మదనపల్లె ఎమ్మెల్యే

కాణిపాకం, జనవరి 24 ప్రభాతవార్త:

అన్నమయ్య జిల్లా మదనపల్లె శాసనసభ్యులు నవాజ్‌బాషా మంగళవారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. వారి వెంట ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్ కోదండపాణి,స్థానిక వైకాపా నాయకులు రవిప్రసాద్, రాజ్‌కుమార్, గోపీనాధన్ తదితరులు పాల్గొన్నారు.

దిగువమత్యంలో ప్యామిలీ పిజీషియన్ సేవలు

తవణంపల్లె, జనవరి 24 ప్రభాతవార్త:

మండలంలోని దిగువమత్యం గ్రామంలో మంగళవారం ప్యామిలీ పిజీషియన్ కార్యక్రమంలో భాగంగా రోగులకు వైద్యసేవలందించారు. తవణంపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దాత్రేయ చౌదరి ఆధ్వర్యంలో సిబ్బంది 104 వాహనం ద్వారా రోగులకు వైద్యసేవలందించారు. ఈసందర్భంగా బిపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులకు సంభందించి రోగులకు పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. అలాగే గర్భవతులకు పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. దీనితో పరిసరాల పరిశుభ్రత, అంటువ్యాధుల నివారణపై స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో సీహెచ్ఓ వెంకట రమణ, హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యంరెడ్డి ఏఎన్ఎం తులసి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉగాదినాటికి అధికసంఖ్యలో పక్కాఇళ్ళు పూర్తిచేయాలి.

- ఎంపిడిఓ శ్రీనివాస్ విశ్వనాథ్.

పెద్దపంజాణి జనవరి 24 ప్రభాతవార్త :

ఉగాదినాటికి మండలంలో సాధ్యమైనంత అధికంగా జగనన్న కాలనీలో పక్కాఇళ్ళ నిర్మాణం పూర్తిచేయాలని ఉగాదిసందర్భంగా నూతనగృహాలను ప్రారంభించాలని ఎంపిడిఓ తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం పెద్దపంజాణి సర్పంచ్ జాఫర్‌తో కలసి గ్రామంలో ఆయన పలు అభివృద్ధిపనులను పరిశీలించారు. ఉగాదినాటికి దాదాపు 700గృహాలు పూర్తిఅయ్యేలా సచివాలయసిబ్బంది,హౌసింగ్‌శాఖ కృషిచేయాలన్నారు. గృహనిర్మాణాలు ఎప్పటికప్పుడు వేగవంతం అయ్యేలా ఇంజనీరింగ్ అసిస్టెంట్లు లబ్దిదారుల్లో చైతన్యం కలిగించాలన్నారు. లబ్దిదారులకు వెలగుద్వారా గృహనిర్మాణాలకు అవసరమైన రుణాన్నిసైతం అందించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. లబ్దిదారులు కూడా ఇళ్ళనిర్మాణాలు ప్రారంభించి త్వరగా పూర్తిచేయాలని కోరారు. బిల్లులపై ఎటువంటి అపోహలువద్దని ప్రభుత్వం సకాలంలో గృహనిర్మాణాల లబ్దిదారులకు బిల్లులు మంజూరు చేస్తుందని పేర్కొన్నారు. ఇకపై ప్రతిరోజు మండలంలోని ఒక సచివాలయంను సందర్శించి చేపట్టవలసిన గృహనిర్మాణ ప్రగతిని సమీక్షించడం జరుగుతుందన్నారు.

ఐసిడిఎస్ ఉద్యోగుల నిరసన

కుప్పంరూరల్, జనవరి 24 ప్రభాతవార్త

కుప్పం ఐసిడిఎస్ కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు నిరసన తెలిపారు. అన్నమయ్య జిల్లా రాయచోటి ఐసిడిఎస్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ యువరాజు, ఇతర ఉద్యోగులపై స్థానిక నేతలు దాడి చేయడం దారుణమన్నారు. విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులకు దాడి చేసిన వారిపై ప్రభుత్వం చర్యలు చేపట్టడంతో పాటు బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

అన్ని అవయవాలలోకి కన్నుప్రధానం

సదుం,జనవరి24 ప్రభాతవార్త

మానవునికి ఉన్న అన్ని అవయవాలలోకి ప్రధాన మైనది కన్ను అని జడ్పీటీసీ సోమశేఖరరెడ్డి అన్నారు. మంగళవారం ఊటుపల్లె పంచాయతీ బొమ్మిరెడ్డిగారిపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలో తిరుపతి రూయా వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన క్యాంపునుప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని మారుమూల పల్లెలో ఇటువంటి క్యాంపునిర్వహంచడం గొప్పవిషయమన్నారు. గ్రామీణ ప్రాంతాల వాసులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని కంటి జబ్బులను నివారించుకోవాలన్నారు. కార్యక్రమంలో మొత్తం 61 మంది కంటి వ్యాధుల వారిని పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అదేవిధంగా 21 మందిని ఉచిత శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసుకుని తిరుపతి రుయాకు తరలించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎల్లప్ప, సర్పంచి శ్రీనివాసులురెడ్డి, ఎంపీటీసీ స్వరూప, మాపజీ సర్పంచి రామచంద్రయ్య,మాజీ ఎంపీటీసీ మురళీమోహన్‌నాయుడు,అన్నారెడ్డి, తమటంహేమసుందరరెడ్డి, కంటి వైద్యులు సాధన, లీలావతి,కుష్మిత, సౌందర్య,శశిరేఖ,సుహాసిని, సిబ్బంది సరళ, లోకేష్, పెరుమాళ్, నిర్వహకులు ఆర్.మునస్వామి, వాలంటీరు బోయినిగురురాయల్, పాఠశాల ఉపాధ్యాయులుపాల్గొన్నారు.

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం

రొంపిచెర్ల,జనవరి24ప్రభాతవార్త

మండల పరిదిలోని కస్తూరిబా బాలికల పాఠశాలలో మంగళవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రొంపిచెర్ల పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారిడాక్టర్ రాజా ఆధ్వర్యంలో కార్యక్రమంలోఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి బాలికల ప్రాధాన్యత, లింగ వివక్షతలపై వివరించారు. అదేవిధంగా బాలికల హక్కులు వారిభవిష్యత్తు,ఆరోగ్యం, చదువు పోషణ,సంఘంలోగౌరవం, బాలికల రక్షణ కోసం ప్రభుత్వం చేస్తున్న చట్టాలు గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులుపాల్గొన్నారు.

ఆడపిల్లలను బతికించుకోవాలి

కల్లూరు,జనవరి24ప్రభాతవార్త

ఆడపిల్లలపై జరుగుతున్న దాడుల నుంచి ఆడపిల్లలను బతికించుకోవాలని పులిచెర్ల మండలం కల్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి జానకిరావు అన్నారు. మంగళవారంకల్లూరు పీహెచ్‌సీలో జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఆడపిల్లలకు భవిష్యత్తులో ఎన్నో ఉపాధిఅవకాశాలు ఉన్నాయని మగపిల్లలు, ఆడపిల్లలు వేరుగా చూడరాదని చెప్పారు. అందరు సమానమే అన్నారు. అనంతరం బాలిక సంరక్షణపై తల్లిదండ్రులకు అవగాహనకల్పించారు. కార్యక్రమంలోవైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గర్భవతులు పౌష్టికాహారం తీసుకోవాలి

సదుం,జనవరి24ప్రభాతవార్త

గర్భవతులు, బాలింతలు, కిషోరబాలికలు పౌష్టికాహారం తప్పని సరిగ తీసుకోవాలని అంగన్‌వాడీ చౌడేపల్లె ఏసీడీపీఓ సరళ అన్నారు. మంగళవారం సదుంలోని పంచాయతీ కార్యాలయంలో రక్త హీనత కలిగిన గర్భవతులను గుర్తించి పౌష్టికాహారం, కోడిగుడ్లు పంపినీ చేశారు. ఈసందర్భంగా పంచాయతీ కార్యాలయంలో బాలికల దినోత్సవాన్నినిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అందరికి కోడిగుడ్లు పంపినీ చేస్తున్నామన్నారు. అదేవిధంగా ఇంటి వద్ద ప్రతి ఒక్కరు బాలికలరక్షణకు కృషి చేయాలన్నారు. పిల్లలకు తప్పనిసరిగాపౌష్టికాహారంఅందజేయాలన్నారు. కార్యక్రమంలసర్పంచి ఉషారాణి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శంకరమ్మ,ఆరోగ్య పర్యవేక్షకులు నీలకంఠ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్ధగిరి సన్నిధిలో ఎమ్మెల్యే నవాజ్‌బాషా

తవణంపల్లె, జనవరి 24 ప్రభాతవార్త:

ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీవీరాంజనేయస్వామివారిని మంగళవారం అన్నమయ్య జిల్లా మదనపల్లె శాసనసభ్యులు నవాజ్‌బాషా దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఈఓ నూకా వెంకట సుబ్బారెడ్డి, ఆలయ పాకలమండలి సభ్యులు పార్థసారథిరెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి ఆలయ మండపంలో అర్చకులు, అధికారులు, ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను, సంజీవరాయని పుష్కరిణి తీర్థాన్ని అందజేశారు. ఎమెమమల్యే వెంట ఆయన బంధువులు తదితరులు పాల్గొన్నారు.

గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

బాల్యవివాహాలు అరికట్టాలి

- సీడీపీవో శంషాద్‌బేగం

బాలాయపల్లి, జనవరి 24, ప్రభాతవార్త:

జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా వెంగమాంబపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి బస్టాండు ప్రాంగణం వరకు సీడీపీవో శంషాద్‌బేగం, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెచ్ఎం కుమార్, విద్యార్థినీ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. బాల్య వివాహాలు, ఆరోగ్యం, ఆహారం, విద్య ఇంకా పలు అంశాలపై బాలికలకు సీడీపీవో శంషాద్‌బేగం అవగాహన కల్పించారు. బాలికలు సరైన పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. బాలికలు చదువుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి బాలికల విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఐసీడీయస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి తెలిపారు.

సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన ఎంపీడీవో

బాలాయపల్లి, జనవరి 24, ప్రభాతవార్త:

కాట్రగుంట ప్రాథమిక పాఠశాల, గ్రామ సచివాలయం, నిడిగల్లు గ్రామ సచివాలయం, ఆధార్ క్యాంప్ కేంద్రంను మంగళవారం ఎంపీడీవో వినీల్‌కుమార్ ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కాట్రగుంట పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. జగనన్న గోరుముద్ద భోజనాన్ని నాణ్యతగా చిన్నారులకు అందించాలని పాఠశాల ఉపాధ్యాయులను కోరారు. ఆధార్ క్యాంపులను గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నిర్లక్ష్యపు డ్రైవింగ్ వలనే ప్రమాదాలు

- డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి

వెంకటగిరి, జనవరి 24, ప్రభాతవార్త:

వాహనాలను నడిపే సమయంలో డ్రైవర్లు నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలు జరగవని గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. భద్రతా వారోత్సవాల సందర్భంగా వెంకటగిరిలోని ఏవిఆర్ కళ్యాణ మండపంలో డ్రైవర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. నిబంధనలు పాటించకుండా నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తున్నందు వలన ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా ఆటో డ్రైవర్ల నిర్లక్ష్య వైఖరి వలనే ప్రమాదాలు జరుగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ రామకృష్ణ, ఎస్ఐ జిలానీ తదితరులు పాల్గొన్నారు.

లోకేష్ పాదయాత్ర చూసి భయపడుతున్న వైసీపీ నేతలు

- రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు కేపీకే ప్రసాద్‌నాయుడు

వెంకటగిరి, జనవరి 24, ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేయనున్న పాదయాత్ర చూసి వైసీపీ వారు భయపడుతున్నట్లు రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు కె.వి.కె.ప్రసాద్‌నాయుడు తెలిపారు. నారా లోకేష్ చేపట్టే పాదయాత్ర వాల్‌పోస్టర్‌ను మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణతో కలిసి ఆయన ఆవిష్కరించారు. లోకేష్ పాదయాత్ర వలన ప్రజల్లో మంచి పేరు వస్తుందన్న భయంతో వైసీపీ ప్రభుత్వం అనుమతి ఇవ్వడంలేదన్నారు. వైసీపీ వారు ఎన్ని అడ్డంకులు సృష్టించినా పాదయాత్ర జరుగుతుందన్నారు. జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రకు టీడీపీ ప్రభుత్వం అనుమతి ఇచ్చి బందోబస్తు కల్పించిందని గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు తగు గుణపాఠం చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు శివతేజయాదవ్, టీఎన్ఎస్ఎఫ్ తిరుపతిపార్లమెంటుఅధికారప్రతినిధి హేమంత్‌చౌదరి, టీఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి కె.సుకుమార్, టీఎన్ఎస్ఎఫ్ టౌన్ కమిటీ నాయకులు నాని, రామ్, సాయి పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో అవినీతి తప్ప అభివృద్ధి లేదు

- మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, జనవరి 24, ప్రభాతవార్త: వైసీపీ ప్రభుత్వంలో అవినీతి తప్ప అభివృద్ధి లేదని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరి పట్టణం పదో వార్డు మనులాలపేటలో ఆయన ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్రాల్లో మరలా అభివృద్ధి జరగాలంటే తెలుగుదేశం పార్టీని గెలిపించాలన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉండగా వెంకటగిరిని పట్టణాన్ని ఎంతో అభివృద్ధి చేస్తానని చెప్పారు. మూడు సంవత్సరాల వైసీపీ ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. ఇంటింటికి తిరిగి వైసీపీ ప్రభుత్వ వైఫల్యాల కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు కె.వి.కె.ప్రసాద్‌నాయుడు, పట్టణ పార్టీ అధ్యక్షుడు గంగాధర్, నాయకులు సత్యనారాయణ, ఆనంద్, బాబు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలి

- ఎమ్మెల్యే వరప్రసాదరావు

కోట, జనవరి 24 ప్రభాతవార్త

రాష్ట్రంలో మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలు ఆదరిస్తారని గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ వెలగపల్లి వరప్రసాదరావు చెప్పారు. మంగళవారం కోట మండలం చెందోడు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే వరప్రసాదరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి మూడున్నరేళ్ల కాలంలో ఒక్కో ఇంటికి ఎంత లబ్ధి పొందారో అనే బుక్‌లెట్లు పంపిణీ చేశారు. రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకు పోవాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. భారతదేశ చరిత్రలోనే 66 లక్షల పింఛన్లు ఇవ్వడం జరుగుతోందన్నారు. ఆయన వెంట మండల వైసీపీ కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, సెంట్రల్ బ్యాంకు డైరెక్టర్ నరమాల వెంకటరమణయ్య, మొబిన్‌బాషా, చిల్లకూరు సాయిప్రసాద్‌రెడ్డి, అధికారులు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలి

- సిడిపిఓ జ్యోతి

కోట, జనవరి 24 ప్రభాతవార్త

బాలికలు అన్ని రంగాల్లో ముందుకు దూసుకుపోవాలని కోట ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ జ్యోతి అన్నారు. మంగళవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థినుల కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బాల్య వివాహాలు, అక్రమ రవాణా, చట్టం, తదితర అంశాలపై ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కవిత, పద్మ, బుజ్జమ్మ, మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌బికెఆర్‌లో జెఇఇ మెయిన్స్ ప్రారంభం

కోట, జనవరి 24 ప్రభాతవార్త

దేశ వ్యాప్తంగా వివిధ ఐఐటిలలో, ఎన్ఐటిలలో ప్రవేశాల కోసం జెఇఇ మెయిన్స్ పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలు కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో జరిగాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 118 మంది విద్యార్థులు హాజరు కాగా, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండో విడతలో జరిగిన పరీక్షలకు 111 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు. పరీక్షకు గంట ముందు నుంచే పరీక్షా కేంద్రంలోకి అనుమతించారు. అర్ధగంట ముందు ప్రవేశ ద్వారాలు మూసివేశారు. పరీక్షా సమయం పూర్తయ్యే వరకు ఆ ప్రాంగణంలో ఎవరినీ అనుమతించలేదు.

పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

- తిరుపతి జిల్లా ఉప విద్యాశాఖ అధికారి శివప్రకాష్‌రెడ్డి

సూళ్లూరుపేట, జనవరి 24 ప్రభాతవార్త

పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని తిరుపతి జిల్లా ఉప విద్యాశాఖ అధికారి శివప్రకాష్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్ రచించిన మొదటి ర్యాంక్‌కు వంద సూత్రాలు అనే పుస్తకాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ప్రస్తుతం ఉపాధ్యాయులు నేర్పించిన విద్యతో పాటు తామూ శ్రమించి ఇంటి వద్ద వర్క్ చేయాలని సూచించారు. ఇందుల

రైతు బరోసా కేంద్రాల సేవలు విస్తృతం చేయాలి : విజిలెన్స్ ఇన్స్‌ఫెక్టర్

వెదురుకుప్పం, జనవరి 24 ప్రభాతవార్త :

రైతు బరోసా కేంద్రాల సేవలను మరింత వస్తృతం చేయాలని విజిలెన్స్ ఇన్స్‌ఫెక్టర్ వెంకట్ రవి అధికారులను ఆదేశించారు. మండలంలోని పెరుమాళ్ళపల్లె పంచాయితీ పరిధిలోని రైతు బరోసా కేంద్రంను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా విజిలెన్స్ అధికారులు, వ్యవసాయాధికారుల బృందం క్షేత్ర స్థాయిలో పంటల సాగు, విధానం పద్ధతులను పరిశీలించి, రైతులతో ప్రక్షత్యంగా మాట్లాడి సమాచారం తెలుసుకున్నారు. అనంతరం రైతు బరోసా కేంద్రంలో రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సకాలంలో రైతులకు పంటల సాగు మెలుకువలు తెలియజేయాలని చెప్పారు. అలాగే క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలించి రైతులకు కావలసిన సలహాలు, చూచనలు అందజేయాలన్నారు. రైతు బరోసా కేంద్రంలో రాయితీ విత్తనాతు, ఎరువులు, పురుగుమందులు పంపిణీ రికార్డులు పరిశీలించారు. పంట భీమానమోదు కార్యక్రమం తెలుసుకున్నారు. విత్తనాల మొలక శాతం కిట్లు మొదలైన అంశాలను రైతులకు ప్రశ్నించి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. పనితీరుపట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. రైతు బరోసా కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బండి శశిఆనంద రెడ్డి, విజిలెన్స్ అసిస్టెంట్ఇన్స్‌ఫెక్టర్ విజయకుమార్, మండల వ్యవసాయాధికారిణి వనిత, వ్యవసాయ సహాయకులు ఈశ్వర్ రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పరిటాల రవి వర్ధంతి

పుత్తూరు, జనవరి 24 ప్రభాతవార్త :

తెలుగుదేశం పార్టీకి చెందిన మాజీ మంత్రి పరిటాల రవీంద్ర వర్ధంతిని ఆ పార్టీకి చెందిన చిత్తూరు జిల్లా మాజీ అధికార ప్రతినిధి పోతుగుంట విజయ్‌బాబు నేతృత్వంలో మంగళవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ నిర్మాణానికి పరిటాల రవి విశేషంగా కృషి చేశారని కొనియాడారు. భౌతికంగా లేకపోయినా ఆయన ఆశయ సాధనకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. అనంతరం పరిటాల రవి చిత్రపటానికి పూలదండలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి రవినాయుడు కెవిఎస్‌కె స్టేట్ డైరక్టర్ సుమన్‌నాయుడు, టిఎన్‌టియుసి జిల్లా కార్యదర్శి అరవ ప్రకాష్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు హెచ్.సుబ్రమణ్యం, ఇంకా బాబు రెడ్డి, టైల్స్ సుధ, చంద్రయాదవ్, వంశీ, రమేష్, రవియాదవ్, ముని, అప్పయ్య, విజయ్, సుధ, రఘు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు పరిష్కరిస్తాం

విజయపురం, జనవరి 24 ప్రభాతవార్త :

మండలంలోని మల్లారెడ్డికండ్రిగలో మంగళవారం పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు తెలిపే కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపిపిలు బాలాజీ, దశరథరాజు, మండల వైసిపి అధ్యక్షుడు గోపినాథ్, సర్పంచ్‌లు కుప్పారెడ్డి, శాంతి, మురళీకృష్ణారెడ్డి, భాస్కర్‌రాజు, ఎంపిటిసిలు రాజగోపాల్, రాజేంద్రన్, నాయకులు రామకృష్ణమరాజు, శరత్, గిరి తదితరులు పాల్గొన్నారు.

బంగారు గొలుసు చోరీ

పుత్తూరు, జనవరి 24 ప్రభాతవార్త :

పట్టణంలో సుబ్రమణ్యస్వామి ఆలయం పక్క సందులో ఒక వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు గుర్తు తెలియని వ్యక్తి తెంపుకుని పారిపోయాడు. పాల వ్యాపారం చేసే బాధిత మహిళ వద్దకు మంగళవారం ఉదయం అయిదు గంటలకు ఒక వ్యక్తి అయిదు లీటర్ల పాలు ఇవ్వాలని అడిగాడు. ఆ వ్యక్తి సంచిలో పాల ప్యాకెట్లు వేసేందుకు ముందుకు వంగిన మహిళ మెడలోని అయిదున్నర సవరాల బరువున్న గొలుసును లాక్కుని పరారయ్యాడు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

శివయ్య సేవలో ఉద్యోగ సంఘ నాయకుడు

శ్రీకాళహస్తి, జనవరి 24 ప్రభాతవార్త

దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో రాష్ట్ర ఎపిఎన్‌జిఓ సంఘ నాయకుడు బండి శ్రీనివాసులు పూజలు చేయించుకున్నారు.వారికి ఎపిపంచాయతీరాజ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మరియు శ్రీకాళహస్తి ఎన్‌జిఓ అధ్యక్షుడు చెంచురత్నంయాదవ్ సారధ్యంలో భారీ ఎత్తున స్వాగతం పలికారు.స్వామి అమ్మవార్లను దర్శించుకున్న ఆయనకు గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు.ఆయనకు దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో ఎసి మల్లికార్జున్ ప్రసాద్ వేదపండితులతో స్వాగతం పలికారు. ఏర్పాట్లను ఆలయ ఎఇఓ సతీష్‌మాలిక్, ఆలయపిఆర్‌ఓలుశ్రీనాథ్, నారాయణస్వామి, యుగంధర్, టెంపుల్‌ఇన్స్పెక్టర్‌హరియాదవ్‌లు పర్యవేక్షించారు.

ఇద్దరు అనుమానితుల అరెస్టు

శ్రీకాళహస్తి రూరల్, జనవరి 24 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మండలంలోని ఇసిఎల్ పరిశ్రమలో దొంగతనానికి పాల్పడుతున్నట్లు అనుమానించిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు సిఐ అజయ్‌కుమార్ మంగళవారం తెలిపారు. గత కొంత కాలంగా పరిశ్రమ సమీపంలో కమ్మి, డస్టు వేస్తేజి ఉండేది. అయితే గత కొంత కాలంగా పరిశ్రమ నుంచి వస్తువులు చోరీ జరుగుతున్నట్లు కంపెనీ నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం అనుమానితులు శ్రీకాళహస్తి పట్టణంలోని కొండమిట్టకు చెందిన కళ్యాణ్, బిపి అగ్రహారినికి చెందిన మునిరెడ్డిలనుఅదుపులోతీసుకొనివిచారిస్తున్నట్లు వివరించారు. కేసు నమోదు చేసినట్లు సిఐ వివరించారు.

నారాయణపురంలో దాడి

శ్రీకాళహస్తిరూరల్, జనవరి 24 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మండలంలోని నారాయణ పురం గ్రామానికి చెందిన వెంకటస్వామి రెడ్డి గ్రామానికి చెందిన పాండురెడ్డి ఇంటిపై పాతకక్షలతో దాడి చేసినట్లు ఫిర్యాదు అందిందని ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సిఐ అజయ్‌కుమార్ మంగళవారం తెలిపారు.వెంకటస్వామి రెడ్డిని అరెస్టు చేసినట్లు వివరించారు.

విశాఖ ఉక్కు ప్రవేటీకరణను ఆపాలి

శ్రీకాళహస్తి, జనవరి 24 ప్రభాతవార్త

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్‌చేస్తూ సిపిఐ,సిఐటియు సారధ్యంలో మంగళవారం శ్రీకాళహస్తి ఆర్‌డిఓ కార్యాలయం వద్ద బైఠాయించారు. సిపిఐ నాయకులు మంగళవారం కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలకు రాష్ట్ర ప్రభుత్వం బాకా ఊదటంను నిరసించారు. ఈ నిర్ణయాలకు నిరసనగా మంగళవారం ఆర్‌డిఓ కార్యాయం వద్ద రోజంతా నిరనస తెలుపుతూ బైఠాయించారు. ఆర్‌డిఓ కార్యాలయంలో వినతి పత్రం అందించారు.

ఆర్డీవో, తహశీల్దార్‌కు ఎన్‌విడి అవార్డులు

శ్రీకాళహస్తి, జనవరి 24 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి ఆర్డీవో, మరియు ఎలక్షన్ రిజిస్ట్రేషన్ అధికారి కెఎస్.రామా రావు, అసిస్టెంట్ రిజిస్ట్రేషన్ తహశీల్దార్ షేక్.జరీనాలకు శ్రీకాళహస్తి నియోజవర్గం-168లో ఎలక్షన్ ఎన్‌రోల్‌మెంట్ మరియు కొత్తఓటర్ల నమోదు జాబితాలో నిబద్ధతతో పనిచేసినందుకు జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో నేడు తిరుపతిలోని ఎస్వీయూని వర్సిటీలో ఉన్న శ్రీనివాస ఆడిటోరియంలో నిర్వహించనున్న కార్యక్రమం లో జిల్లాస్థాయిఉత్తమఎన్నికలప్రక్రియ అధికారులుగా అవార్డులు అందుకోనున్నారు. ఈసందర్భంగా పలువురు అభినందించారు.

కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని వాహనాలను నడపండి

-ఎంఎల్‌ఏ బియ్యపు

.శ్రీకాళహస్తి, జనవరి 24 ప్రభాతవార్త

వాహనాలను నడిపేటపుడు ప్రతి ఒక్కరు తమ కుటుంబసభ్యులను దృష్టిలో ఉంచుకుని వాహనాలను నడపాలని శాసనసభ్యుడు బియ్యపుమధుసూధన్‌రెడ్డి అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నతపాఠశాల నుంచి శ్రీకాళహస్తి ఎంపిఐ దామోదర్‌నాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ద్విచక్రవాహనాల ర్యాలీకి ఎంఎల్‌ఏ బియ్యపుమధుసూధన్‌రెడ్డి, డిఎస్పీ ధర్మవరపువిశ్వనాథ్‌లు విచ్చేశారు. డిఎస్పీ పచ్చజెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ వాహనాలు నడిపేటపుడు వారిమీదే కాకుండా వారి కుటుంబసభ్యులను కూడా దృష్టిలో ఉంచుకుని వాహనాలను నడపాలని కోరారు. ద్విచక్రవాహనదారులు ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలని అప్పుడే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ముఖ్యంగా ప్రజలు, యువత వాహనాలను అతివేగంతో నడుపుతున్నారని అయితే తల్లిదండ్రులు కూడా వాహనాలను అతివేగంగా నడపరాదని తెలియజేయాలన్నారు. లైసెన్సు,వాహనానికి సంబందించిన రికార్డులు ఉండాలని, అంతేకాకుండా మద్యం సేవించి వాహనాలను నడపవద్దని ఎంఎల్‌ఏ సూచించారు.అనంతరం హెల్మెట్ ధరించి బాలుర ఉన్నత పాఠశాల నుంచి ప్రజలకు అవగాహన కల్పిస్తూ ద్విచక్రవాహనాల ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ అంజూరుతారకశ్రీనివాసులు, డిఎస్పీ విశ్వనాథ్, ఎంపిఐ దామోదర్‌నాయుడు, బుచ్చినాయుడుకండ్రిగ సిఐ విక్రమ్, రూరల్ సిఐ అజయ్, టుటౌన్ ఎస్ఐ మహేష్‌బాబు, జిల్లా వక్స్‌బోర్డు అధ్యక్షుడు సిరాజ్‌బాషా, ఆలయ బోర్డు సభ్యులు మున్నారాయల్, నాయకులు ఆర్కాడు శంకర్, నాని, సునీతసింగ్, పులిరామచంద్ర, సురేష్, ఫజల్, మురళీకృష్ణారెడ్డి, రవి, జయరామయ్య, దాము, భావాజీ, మణి, బాబు, చిట్టి రవాణాశాఖ మరియు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

గణిత ఒలింపియాడ్ పరీక్షల్లో దస్కూల్ విద్యార్థుల ప్రతిభ

శ్రీకాళహస్తి, జనవరి 24 ప్రభాతవార్త

పట్టణంలోని ద స్కూల్ విద్యార్థులు గణిత ఒలిపియాడ్ పరీక్షల్లో తమ అత్యుత్తమ ప్రతిభను చాటినట్లు కరస్పాండెంట్ జనార్ధన్‌రావు జె.పవార్ తెలిపారు. జాతీయ స్థాయిలో నిర్వహించే గణిత ఒలింపియాడ్ మొదటి స్థాయి పరీక్షలో తమ పాఠశాలలో 4,5 తరగతులు విద్యార్థులు పాల్గొన్నారని, వీరందరూ ఫిబ్రవరిలో జరిగే రెండో జాతీయ స్థాయి పరీక్షల్లో పాల్గొంటారని అన్నారు. జాతీయ స్థాయి గణిత, సైన్సు పోటీ పరీక్షలకు తమ విద్యార్థులకు ఆ పాఠ్యాంశాలలో తర్ఫీదు ఇవ్వడం జరుగుతోందన్నారు. దీని వల్ల భవిష్యత్తులో ఉన్న విద్య పోటీ , పరీక్షలకి సోపానం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.విశాల, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

స్వామిజీకి భక్తి పూర్వక స్వాగతం

రేణిగుంట, జనవరి 24 ప్రభాతవార్త:

శ్రీపాద వల్లభ వెంకట విశ్వనాథస్వామిజీకి రేణిగుంట మండల శివారులో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఘనంగా భక్తి పూర్వక స్వాగతం పలికారు. ఢిల్లీ నుంచి విమానంలో చెన్నై వచ్చి అక్కడి నుంచి రోడ్డు మార్గంలో తిరుమల ఎవారి దర్శనార్థం వస్తున్న స్వామిజీకి రేణిగుంట మండలం మొలగమూడి వద్ద శ్రీకాళహస్తి ఎమ్మెల్యే ఎదురు వెళ్లి సాదరంగా ఆహ్వానించి భక్తి పూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆశీస్సులు తీసుకుని ఆయనతో కలసి బయలుదేరారు. మార్గమధ్యంలో గాజులమండ్యం పోలీస్‌స్టేషన్ సర్కిల్ వద్ద తారక రామానగర్ వైసీపీ ఇన్‌చార్జి మన్యం శ్రీనివాసులురెడ్డి(ఎంఎస్‌ఆర్) తమ అనుచరులు మిత్ర బృందంతో ఎదురేగి స్వామిజీకి భక్తి పూర్వకంగా పూలబొకే ఇచ్చి ఆయన ఆశీర్వచనం పొందారు. స్వామిజీకి బూడిద, గుమ్మడి కాయతో హారతి ఇచ్చి దష్టి తీసి స్వామిజీ ఆశీర్వాదం పొందారు. ఎమ్మెల్యేకి స్వాగతం పలికారు. అందరూ కలసి తిరుచానూరుకు వెళుతుండగా తూకివాకం సర్పంచ్‌తో పాటు వైసీపీ మహిళా నాయకురాలు అరుణ తన అభిమానులతో తూకివాకం వద్ద స్వామిజీకి స్వాగతం పలికారు. ఎమ్మెల్యేకి పూల బొకేలు ఇచ్చి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం వీరు రోడ్డు మార్గంలో తిరుచానూరు బయలుదేరి వెళ్లారు. స్వామిజీకి స్వాగతం పలికిన వారిలోఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, వైసీపీ సీనియర్ నేతలు జువ్వల దయాకర్‌రెడ్డి, గాజులమండ్యం సర్పంచ్ గంగారి రమేష్ తదితరులు ఉన్నారు.

రాస్ సంఘాలకు ఆడిట్‌పై అవగాహన సదస్సు

రేణిగుంట, జనవరి 24 ప్రభాతవార్త:

రాస్ మహిళా జ్యోతి మ్యూచువల్ బెనిఫిట్రస్టు, ఇందిరానగర్, కరకంబాడిలో రాష్ట్రీయ సేవా సమితి పొదుపు సంఘాల సంచాలకులు వి.నాగరాజు ఆదేశానుసారం పొదుపు సంఘాల ఆడిట్ రిపోర్టును మంగళవారం అందజేశారు. గత నెలలో ఇందిరానగర్ క్లస్టర్‌లో ఉన్న 56 సంఘాల 688 మంది సభ్యులకు సంబంధించి అన్ని రికార్డులను, పొదుపు ఆఫీసు నుంచి ఇచ్చిన అప్పులు, వడ్డీలు, మూల నిధిలో భాగం, బ్యాంకు లావాదేవీల అన్ని లెక్కలను ఆడిట్ చేశారు. సోమవారం సమావేశాన్ని ఏర్పాటు చేసి ప్రతి సంఘానికి ఇద్దరు లీడర్లను పిలిపించి ఆడిట్ రిపోర్టు అందించి, అంతర్గత ఆడిట్ విభాగ అధిపతి బాలాజీరెడ్డి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఆఫీసర్ వెంకటేష్, వెంకటకుమార్, బాలాజీ, ఇంధుమతి, నాగమణి, జ్యోతి, గౌతమి, స్వాతి, శంకరయ్య క్లస్టర్ లీడర్లు పాల్గొన్నారు.

సంగం వీరయ్య చౌదరికి ఘన నివాళి

పుత్తూరురూరల్, జనవరి 24 ప్రభాతవార్త:

సంగం డైరీ వ్యవస్థాపక చైర్మన్, మాజీ మంత్రి దివంగత దూళిపాళ్ళ నరేంద్ర చౌదరి వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. రూరల్‌మండల పరిధిలోని గొల్లపల్లి సంగం డైరీ ప్లాంట్ ఇన్‌చార్జి శ్రావణ్ కృష్ణ ఆధ్వర్యంలో 27వ వర్ధంతి సందర్భంగా మంగళవారం సిబ్బంది వీరయ్య చౌదరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి సమాఖ్య చైర్మన్‌గా గ్రామాల్లో పాల సొసైటీలు ఏర్పాటు చేసి పాడి రైతుల జీవన ప్రమాణాలు పెంచి పాల సేకరణకు నడుం కట్టారని కొనియాడారు. ఉమ్మడి రాష్ట్రంలో మొట్ట మొదటిగా డైరీ ప్రారంభించి నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తూ పాడి పరిశ్రమ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో డైరీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బాలుర అండర్ 17 రోల్‌బాల్ ఛాంపియన్‌గా పుత్తూరు విద్యార్థి

పుత్తూరురూరల్, జనవరి 24 ప్రభాతవార్త:

బాలుర అండర్ 17 రోల్ బాల్ టోర్నీలో పుత్తూరు శ్రీ సాయిజ్యోతి జూనియర్ కళాశాలలో ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి గజేంద్ర ఛాంపియన్‌గా గెలుపొందాడు. ఈ సందర్భంగా రమేష్ కరస్పాండెంట్ హరినాథ్‌రెడ్డి, డైరెక్టర్ బాబురావు, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం

పిచ్చాటూరు, జనవరి 24, ప్రభాతవార్త

పిచ్చాటూరు మండలంలోని ప్రాజెక్టు పరిధిలో జడ్పి హైస్కూల్‌లో స్రీ – శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌ఓ పాల్గొని బాలికల సామాజిక ఎదుగుదల పై వివరించారు. ఎంఇఓ మాట్లాడుతూ అమ్మాయిల చదువుల గురించి భవిష్యత్తు గురించి శారీరక మార్పుల గురించి చక్కగా వివరించారు. నేటి బాలికలే రేపటి మహిళలుగా మంచి స్థాయిలో రాణించాలని కోరారు. అనంతరం మహిళా కానిస్టేబుల్ సంధ్యా బాలికల యొక్క హక్కులు, దిశా చట్టం గురించి వివరించారు. బాలికల ఆరోగ్యం, వ్యక్తిగత శుభ్రత గురించి హెల్త్ సూపర్వైజర్ శాంత వివరించారు. చదువుకునే వయస్సులో చదువుపై మాత్రమే ధ్యాస వుండాలని, వారి యొక్క లక్ష్యం సాధించాలని హెచ్ఎం యుగంధర్ రాజు వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం,ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు మరియమ్మ, కల్పలత, అంగన్‌వాడి కార్యకర్తలు కృష్ణవేణి, గ్లోరి తదితరులు పాల్గొన్నారు.

సాగులో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వండి - సీపీఎం డిమాండ్

కేవీబీ పురం,జనవరి 24 ప్రభాతవార్త:

కేవీబీ పురం మండలంలోని శ్రీనివాసపురంలో పేదలు సాగులో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వాలని సత్యవేడు నియోజకవర్గ సీపీఎం ఇన్‌చార్జి, కార్యవర్గ సభ్యుడు దాసరి జనార్ధన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం శ్రీనివాసపురంలోని బాధిత రైతులతో కేవీబీ పురం తహసీల్దార్ ద్వారకానాథరెడ్డికి వినపత్రిత్రం అందజేశారు. ఈ సందర్భంగా దాసరి జనార్ధన్, శ్రీనివాసపురం మాజీ సర్పంచ్ దేవరాజులు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా పేదలు ప్రభుత్వ భూములను చెట్లు, పుట్లు తొలగించి చదును చేసి సాగు చేస్తుంటే కొందరు అక్రమంగా పట్టాలు పొంది నేడు పేదలపై దౌర్జన్యం చేస్తున్నారని వాపోయారు. తక్షణమే తహసీల్దార్ స్పందించి సాగులో ఉన్న వారికి వేల రూపాయలు అప్పు చేసి భూములను చదును చేసిన పేదలకే చెందే విధంగా చర్యలు తీసుకుని అక్రమంగా పొందిన పట్టాలను రద్దు చేసి పేదలకు సాగు భూమి పట్టాలు ఇవ్వాలని తహసీల్దార్‌ను కోరారు. ఈ సందర్భంగా తహసీల్దార్ స్పందిస్తూ వీఆర్, ఆర్ఐ సర్వేయర్లతో విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసపురం గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల తరపున న్యాయం పోరాటం చేస్తా - ఎమ్మెల్సీ అభ్యర్థి వెంకటేశ్వరరెడ్డి వెల్లడి

న పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా గెలిపించండి

కేవీబీ పురం, జనవరి 24 ప్రభాతవార్త:

కేవీబీ పురం మహిళా సమస్యలపై అనునిత్యం యాక్షి సంస్థ పని చేస్తున్న నేపథ్యంలో మహిళలు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని రాష్ట్ర కో-ఆర్డినేటర్ పవిత్ర తెలిపారు. మంగళవారం కేవీబీ పురం మండలంలోని రాయపేడు, బంగ్లా మండలంలోని గ్రామ పంచాయతీలకు చెందిన మహిళలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై అదే విధంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంపై మహిళలతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళలకు బాలికలకు సమస్యలు ఉత్పన్నమైనప్పుడు పరిష్కారాన్ని ఎలా తీర్చుకోవాలని తీర్చుకోవాలని సమావేశంలోచర్చించారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, అదే విధంగా కుటుంబాలు సంతోషకరంగా ఉండాలని, దీంతో పాటు చట్టాలను సరిగా ఉపయోగించుకోవాలని ఆమెతెలిపారు. యాక్షి సంస్థ నేతృత్వంలో సావిత్రబాయి పూలే దళిత సంఘం ద్వారా అనేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. భారత రాజ్యాంగానికి సంబంధించి అనేక పుస్తకాలను ప్రతి గ్రామంలో అందరూ చదువుకునే విధంగా సంస్థలో పని చేసేవారు కృషి చేయాలన్నారు. చట్టాలపై అవగాహన లేకుంటే ఆర్థిక ఫలాలు సంక్షేమ ఫలాలు దూరం అవుతాయని ఆమె తెలిపారు. ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన పెంపొందింప చేసుకుని సమాజంలో సాంఘిక అంగీకారం కలిగి స్వేచ్ఛగా జీవించుట కొరకే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రూపొందించాలని తెలిపారు. జిల్లా కో-ఆర్డినేటర్లు మురగమ్మ, ప్రియ, 10 గ్రామాలకు చెందిన ఫెసిలిటీ లీడర్లు, మహిళలు పాల్గొన్నారు.

నగరిలో ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం

నగరి, జనవరి 24 ప్రభాతవార్త:

నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ బాలికా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థిని, విద్యార్థులకు బాలికల ప్రాముఖ్యత, బాలికలు, స్త్రీల అభివృద్ధికి సమాజంలో వారి సమానత్వానికి కృషి చేయాల్సి ఉందన్నారు. ఈ సందర్భంగా ఇందిరాప్రియదర్శిని మాట్లాడుతూ హత్యలు నివారించటానికి కఠిన చట్టాలు తేవాలన్నారు. ఈ కార్యక్రమం కళాశాలలో మహిళా సాధికారత ఆధ్వర్యంలో నిర్వహించారు.కార్యక్రమంలో మహిళా సాధికారతసెల్‌ఇందిరాప్రియదర్శిని,విలేజ్‌ప్రిన్సి పల్‌సుబ్రహ్మణ్యం,పంకజ,షర్మిళ,విద్యార్థులు పాల్గొన్నారు.

అత్యంత వైభవంగా నడివీధి గంగమ్మ జాతర

తిరుపతి కార్పొరేషన్, జనవరి 24, ప్రభాతవార్త

తిరుపతి నగర పాలక సంస్థ పరిధిలోని 29వ డివిజన్‌లోని నరసింహా తీర్థం రోడ్డు, కుమ్మరితోపు, ఊటగుంటలో నడివీధి గంగమ్మ జాతరను స్థానికులు ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరంలాగానే ఈ ఏడు కూడా శ్రీ తాతయ్యగుంట గంగమ్మ ఆలయం నుంచి అమ్మవారికి సారెను నగర పాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, ఉప మేయర్ భూమన అభినయ్, స్థానిక కార్పొరేటర్ ఆదిలక్ష్మి, వెంకటేశ్వర్లుకి, తిరుపతి తాతయ్య గుంట గంగమ్మ ఆలయ ఈఓ మునికృష్ణయ్య, పాలకమండలి సభ్యులు సారెను అందచేయగా ఉప మేయర్ ముద్ర నారాయణ, కార్పొరేటర్లు ఎస్‌కె బాబు, నరసింహ ఆచారి, పొన్నాలచంద్ర, రేవతి, శైలజ, సునీత, కల్పన, ప్రవళిక రెడ్డి, సంధ్య, డివిజన్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ 29 డివిజన్ కార్పొరేటర్లు ఆదిలక్ష్మి, స్థానికులు ఆధ్వర్యంలో ఘనంగా డప్పులు, సర్పాలు వాయిద్యాల మధ్య, వేషదారణలతో అమ్మవారికి వస్త్రాలు, కంకుమలతో కూడిన నడివిధి గంగమ్మకు వస్త్రాలతో సారెను కార్పొరేటర్లు అందరం సమర్పించమని తెలిపారు. ఉపమేయర్ భూమన అభినయ్ మాట్లాడుతూ ఊటగుంట నడివీధి గంగమ్మ జాతరలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానని, స్థానికులు గంగమ్మ దర్శించుకుని కృపా కటాక్షాలు పొందాలని తెలియజేసారు. డివిజన్ కార్పొరేటర్ ఆదిలక్ష్మి మాట్లాడుతూ 40 సంవత్సరాల నుండి ఊటగుంట నడివీధి గంగమ్మ జాతీర నిర్వహించడం ఆనవాయితి అని తెలిపారు. మంగళవారం జరిగిన నడివీధి గంగ జాతరకు నగరం నుంచి ప్రజలు పాల్గొనడం చాలా ఆనందం ఇచ్చిందని తెలిపారు.

తిరుపతి డివిజన్

వైకాపా కార్యకర్త కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

నారాయణవనం, జనవరి 24 ప్రభాతవార్త :

సత్యవేడు నియోజవర్గం శాసనసభ్యులు కోనేటి ఆదిమూలం స్వగ్రామం భీమునిచెరువుకు చెందిన వైకాపా కార్యకర్త వరదయ్య కుటుంబాన్ని పరామర్శించారు. కొద్దిరోజుల క్రితం అతని తల్లి శీలమ్మ మృతి చెందింది. దీంతో పాటు వరదయ్య చిన్నపాటి అనారోగ్యానికి గురికావడంతో పరామర్శించి, ఆర్థిక సాయం అందించారు. ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. ఆయనతో పాటు గ్రామప్రజలు పాల్గొన్నారు.

జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భారీ బైక్ ర్యాలీ

నారాయణవనం, జనవరి 24 ప్రభాతవార్త :

జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా చివరి రోజు మంగళవారం స్థానిక సిద్దార్థ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులతో కలిసి పుత్తూరు రూరల్ సిఐ ఎం సురేష్‌కుమార్, ఎస్ఐ మాల్య పరమేష్‌నాయక్, సిబ్బంది భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచంలోనే భారత్‌దేశంలోనే అత్యధికంగా రోడ్డు ప్రమాదాలు జరిగుతున్నట్టు గుర్తించిన కేంద్ర ప్రభుత్వం రోడ్డు ప్రమాదాలను భారీగా తగ్గించడం కోసం అవగాహన కార్యక్రమాలు, బైక్ ర్యాలీలను నిర్వహిస్తున్నట్టు గుర్తు చేశారు. ప్రమాదాల నివారణకు

నారా లోకేష్ పాదయాత్ర విజయవంతం కావాలి.!

టిడిపి మండల ఉపాధ్యక్షుడు కొత్త శానంబట్ల తులసి రెడ్డి , మెట్టు వద్ద కొబ్బరికాయలు, హనుమాన్ భక్తులకు అన్నదానం

చంద్రగిరి, జనవరి 24 ప్రభాతవార్త:

ఈ నెల 27న కుప్పం నుండి నారా లోకేష్ చేపట్టనున్న పాదయాత్ర విజయవంతం కావాలని టిడిపి మండల ఉపాధ్యక్షుడు కొత్త శానంబట్ల తులసి రెడ్డి ఆకాంక్షించారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రజల కష్టాలను తెలుసుకునేందుకై ఈ నెల 27 నుండి 4 వేల కిలోమీటర్లు పాదయాత్ర చేపట్టనున్న నేపథ్యంలో మంగళవారం తులసి రెడ్డి ఆధ్వర్యంలో శ్రీవారిమెట్టు వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు 516 కొబ్బరికాయలు కొట్టారు. మెట్టు వద్ద గల శ్రీవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా శ్రీవారిమెట్టు దారిలోని భక్తాంజనేయ స్వామి ఆలయానికి చేరుకుని స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద 500

మంది శ్రీవారి భక్తులకు అన్నదానం జరిపించారు. నారా లోకేష్ చేపట్టే పాదయాత్రకు ఎటువంటి ఇబ్బందులు కలిగించకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలి న భాధ్యత ప్రభుత్వంపై వుందన్నారు.. ప్రతిపక్ష నాయకుడుగా జగన్ పాదయాత్రకు టిడిపి పటిష్ట కల్పించిన విషయాన్ని విస్మరించవద్దన్నారు. టిడిపి శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి సింగు సుధ దొరస్వామి నాయుడు, మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్, మాజీ జడ్పీటిసి వీరంగారి రమేష్ రెడ్డి, టిడిపి గల్లా యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు సక్కూర్ ధనంజయ రెడ్డి, నాయకులు ఏజి పల్లి బాల, యల్లప్ప రెడ్డి, మంగాపురం భాస్కర్, పాశం చంద్రకుమార్ నాయుడు, దేవేంద్ర రెడ్డి, గురునాథ రెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు శంకర్, రామారావు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల తరపున న్యాయం పోరాటం చేస్తా - ఎమ్మెల్సీ అభ్యర్థి వెంకటేశ్వరరెడ్డి వెల్లడి

కేవీబీ పురం, జనవరి 24 ప్రభాతవార్త:

ఉద్యోగుల ఉపాధ్యాయుల పెన్షనర్లకు క్రమ బద్ధీకరణ నిరుద్యోగులు రూపు మాపించడానికి కృషి చేయడమే నా ధ్యేయమని ప్రభుత్వ విధానాలపై పోరాటం ఉపాధ్యాయులకు ప్రభుత్వ ఉద్యోగులకు ఎలాంటి అన్యాయం జరుగుతుందో అన్నదానిపై పోరాటం చేయడానికి ప్రభుత్వ ఉద్యోగ సంఘాల తరపున ఉపాధ్యాయుల తరపున న్యాయ పోరాటం చేస్తాను పట్టభద్రులు ఎమ్మెల్సీ అభ్యర్థిగా నన్ను గెలిపించండని ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి వెల్లడించారు. మండల కేంద్రమైన కేవీబీ పురంలో మంగళవారం పట్టభద్రులు ఎమ్మెల్సీ అభ్యర్థి ఎన్నికల ప్రచారం చేశారు. తమకు ఓటు వేసి గెలిపిస్తే ప్రభుత్వపరమైన ఉపాధ్యాయులకు ఉద్యోగస్తులకు అందించేందుకు కృషి చేస్తానని వెంకటేశ్వర్‌రెడ్డి వెల్లడి చేశారు.మార్చిలో ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్నాయని, అందులో పీడీఎఫ్ తరపున నేను గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీలో ఉన్నానని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేను ఏ రాజకీయ పార్టీకి సంబంధించిన వాడిని కాదని పీడీఎఫ్ వారి ద్వారా అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ సంఘాలను ప్రశ్నించే అభ్యర్థించే గుణాన్ని అణగదొక్కేసిందని ఉపాధ్యాయులది ఉద్యోగాల వారిది పీఎఫ్ సుమారు 48 వేల కోట్ల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం వాడేసిందని వేలాది ఉద్యోగ నియామక పోస్టులు భర్తీ చేయాల్సి నటువంటి రాష్ట్ర ప్రభుత్వం అనేకనేక ప్రభుత్వ రంగ శాఖల్లో రెగ్యులర్ ఉద్యోగాలు నియామకాలు చేపట్టకుండా కాంట్రాక్టు ఉద్యోగులుగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా నియామకాలు చేపట్టి నిరుద్యోగులు పెంచిందని తెలిపారు. ఉద్యోగులను భర్తీ చేయడంలోరాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ఆ నాడు పాదయాత్రలో ఉద్యోగ సమస్యలు పరిష్కరిస్తానని ఉపాధ్యాయుల ఉద్యోగుల కార్యములు భర్తీచేస్తామని హామీ ఇచ్చిన జగన్మోహన్‌రెడ్డి గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి మూడున్నర సంవత్సరంలో ఏమీ చేయలేదని వాపోయారు. రాష్ట్రంలో భారీ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, కానీ భర్తీకి చర్యలు లేవని, యూనివర్సిటీలు, డిగ్రీ కళాశాల, జూనియర్ కాలేజీలు, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ లాంటి స్కూల్స్ రెగ్యులర్ పోస్టులు ఉన్న భర్తీ చేయకుండా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో ఉపాధ్యాయులను నియమించుకుని ప్రభుత్వాలు అతి తక్కువ వేతనాలు చెల్లిస్తూ శ్రమ దోపిడీకి గురి చేస్తున్నారని తెలిపారు. అదే విధంగా వారికి సరైన పని గంటలు ఇవ్వకుండా ఉదయం 6 నుంచి సాయంత్రం 9 గంటల వరకు పని చేయించడం దారుణమన్నారు. ఈ అన్ని సమస్యల పరిష్కారం కోసం ఖాళీ పోస్టుల భర్తీ కోసం, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉపాధ్యాయులు రెగ్యులర్ కోసం సీపీఎస్ రద్దు కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తానని, కావున మీ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు.

'ఎలక్ట్రీషియన్ డే' ని ప్రభుత్వం గుర్తించాలి

-తిరుపతి ప్రైవేట్ ఎలక్ట్రికల్ అండ్ ప్లంబర్స్ వర్కర్స్ అసోసియేషన్

తిరుపతి ప్రెస్‌క్లబ్,జనవరి 24 ప్రభాతవార్త:

ప్రతి ఏడాది జనవరి 27వ తేదీని రాష్ట్ర వ్యాప్తంగా 'ఎలక్ట్రీషియన్ డే' గా జరుపుకుంటున్నామని, ఈ రోజును ప్రభుత్వం గుర్తించి సెలవు రోజుగా ప్రకటించాలని శ్రీ తిరుపతి ప్రైవేట్ ఎలక్ట్రికల్ అండ్ ప్లంబర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బిసి.హరీష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ 2019 జనవరి 27న సమైక్యవేదిక ద్వారా ఎలక్ట్రీషియన్ డే ని ప్రారంభించడం జరిగిందన్నారు.27వ తేదీ ఉదయం 9 గంటలకు స్థానిక కర్ణాలవీధిలోని అసోసియేషన్ కార్యాలయం నుండి ర్యాలీగా బయలుదేరి బైరాగిపట్టెడలోని గంథమనేని శివయ్యభవన్ కళ్యాణమండపం చేరుకుంటామన్నారు.అక్కడ ఎలక్ట్రీషియన్ డే 4వ వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటామన్నారు.రాష్ట్ర భవన నిర్మాణ సంక్షేమ బోర్డు నుండి కార్మికులకు అందుతున్న సంక్షేమ పథకాలను ఈ ప్రభుత్వం గత మూడేళ్లుగా నిలిపివేసిందని,దానిని పునరుద్ధరించాలని కోరారు.అలాగే ప్రైవేట్ ఎలక్ట్రికల్ కార్మికులకు వృత్తికి సంబంధించిన పరికరాలు కొనుగోలు చేయుటకు ప్రభుత్వం ద్వారా 2 లక్షల రూ॥లు సబ్సిడీతో రుణ సదుపాయం కల్పించాలన్నారు. విధుల్లో భాగంగా కరెంట్ షాక్‌తో మరణించిన కార్మికులకు 10 లక్షలు పరిహారం అందచేయాలన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 5 లక్షల మంది ప్రైవేట్ ఎలక్ట్రికల్ కార్మికులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో అసోసియేషన్ తిరుపతి అధ్యక్షుడు మురగయ్య గౌడ్,జనరల్ సెక్రటరీ జి.భానుప్రకాష్‌రెడ్డి,సెక్రటరీ జిఎస్ఆర్.మూర్తి,కోశాధికారి నీలకంఠం,ఉపాధ్యక్షులు శేషాద్రి,వెంకట్రాయులు,రమేష్,ఆర్గనైజింగ్ సెక్రటరీ చెంచయ్య,జాయింట్ సెక్రటరీ శివకుమార్,కార్యవర్గ సభ్యులు రవి,తదితరులు పాల్గొన్నారు.

కెఎంపిఎల్ పెంచి సంస్థ అభివృద్ధికి కృషి చేయండి

-డ్రైవర్లకు డిపిటిఓ చెంగల్‌రెడ్డి సూచన

తిరుపతి ప్రెస్‌క్లబ్,జనవరి 24 ప్రభాతవార్త:

డ్రైవర్లు తమ బాధ్యతగా డ్రైవింగ్‌లో మెళకువలు పాటించి అత్యుత్తమ కెఎంపిఎల్ సాధించాలని,అలాగే ప్రమాద రహితంగా విధులు నిర్వహించి సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని ఏపిఎస్ఆర్టీసీ తిరుపతి జిల్లా ప్రజా రవాణా అధికారి(డిఇపటిఓ) తిమ్మాడి చెంగల్‌రెడ్డి డ్రైవర్లకు సూచించారు.సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల ప్రకారం తక్కువ కెఎంపిఎల్ తెల్చిన డ్రైవర్లకు,అదేవిధంగా ప్రమాదాలు,బస్సు డ్యామేజ్ చేసిన డ్రైవర్లకు మంగళవారం జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయంలో ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యమ్రానికి జిల్లాలోని 11 డిపోలలో ప్రతి డిపో నుండి ముగ్గురు చొప్పున 33 మంది డ్రైవర్లు శిక్షణ తరగతులకు హాజరయ్యారు.ఈ సందర్భంగా డ్రైవర్లను ఉద్దేశించి డిపిటిఓ మాట్లాడుతూ డీజిల్ ధరలు మార్కెట్‌లో రోజు రోజుకు పెరుగుతుండటంతో దాని ప్రభావం సంస్థ మీద అధిక భారం పడుతోందన్నారు.కావున ప్రతి డ్రైవరు వారి బాధ్యత గుర్తెరిగి ఎక్కువ కెఎంపిఎల్ సాధించడానికి ప్రయత్నించాలని కోరారు.కెఎంపిఎల్ ఎలా పెంచాలో తగిన సూచనలు,సలహాలు అందచేశారు.అలాగే ప్రమాద రహిత డ్రైవింగ్ చేయడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విశదీకరించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ నరసింహులు,తదితరులు పాల్గొన్నారు.

యువగళం బ్యానర్ ఆవిష్కరణ

తిరుపతి,జనవరి 24ప్రభాతవార్త:

యువనేత నారా లోకేష్ చేపట్టనున్న పాదయాత్రకు సంబంధించిన బ్యానర్‌ను మంగళవారం తిరుపతిలో ఆవిష్కరించారు. రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, నిరుద్యోగుల సమస్యలు లోకేష్ తెలుసుకుంటారని నాయకులు తెలిపారు.

గణతంత్రదినోత్సవానికి టిటిడి ముస్తాబు

రేపు జరుపుకోనున్న గణతంత్ర దినోత్సవానికి టిటిడి సిద్ధమైంది. ఇందుకోసం టిటిడి పరిపాలన భవనాన్ని ముందుగానే రంగుంగులతో, వివిధ కళాకృతులతో తీర్చిదిద్దారు. టిటిడి భద్రత విభాగం రిహార్సల్స్ చేపట్టింది. ప్రభాతవార్త-తిరుపతి

కల్యాణ వెంకన్నకు అజ్ఞాత భక్తుడి వితరణ

స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి

చంద్రగిరి, జనవరి 24 ప్రభాతవార్త:

శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి వారికి మంగళవారం తిరుపతికి చెందిన అజ్ఞాత భక్తుడు రెండు బంగారు పతకాలు వితరణ చేసినట్లు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి తెలిపారు. భక్తుడు అందించిన రూ.7.8 లక్షలు విలువైన ఆభరణాలను శ్రీదేవి భూదేవి అమ్మవార్లకు అలంకరించనున్నట్లు తెలిపారు. దాత కుటుంబానికి స్వామి వారి దర్శన ఏర్పాట్లు గావించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ మునిచెగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు బాలాజీ రంగాచార్యులు, అధికారులు పాల్గొన్నారు.

వృద్ధురాలి మెడలో ఐదున్నర సవర్లు బంగారు చైన్ చోరీ

పుత్తూరురూరల్, జనవరి 24 ప్రభాతవార్త:

వృద్ధురాలి మెడలోఐదున్నర సవర్లు బంగారు చైన్ గుర్తు తెలియని వ్యక్తులు లాక్కెళ్లిన సంఘటన మంగళవారం వేకువ జామున జరిగింది. సంఘటనకు సంబంధించి బాధితరాలు కథనం మేరకు... పుత్తూరు పట్టణంలోని స్థానిక ఈశ్వరునిగుడి వీధిలో పాపమ్మ అనే వృద్ధురాలు పాల దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తోంది. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం వేకువ జామున 5.30 గంటల సమయంలో ద్విచక్రవాహనంపై వచ్చిన గుర్తు తెలియని యువకులు ఐదు లీటర్లు పాలు కావాలని సంచి ఇచ్చాడు. ఆమె పాల ప్యాకెట్లు ఫ్రీజ్‌లో నుంచి తెస్తుండగా మెడలోఉన్న ఐదున్నర సవర్లు బంగారు చైన్‌ను కత్తిరించి లాక్కెళ్లారు. దీంతో ఆమె కేకలు వేసింది. ఈ సమయంలో అక్కడ ఎవరు లేకపోవడంతో వారు వెళ్లిపోయారు. ఈ మేరకు బాధితురాలు పుత్తూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

యువగళం సారథి లోకేష్‌ను ఆశీర్వదించండి

శ్రీకాళహస్తి, జనవరి 24 ప్రభాతవార్త

తెలుగుదేశంపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్‌బాబు ఈనెల 27వతేదీ నుంచి యువగళం కార్యక్రమం విజయవంతం చేయాలని కోరుతూతెలుగునాడు విద్యార్థి సమాఖ్య మాజీ రాష్ట్ర కార్యదర్శి మరియు బిసి వెల్ఫేర్ జెఎసి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ యం.ఉమేష్‌రావు ఆధ్వర్యంలో మంగళవారం రోడ్డు పక్క ఉండే అనాథ వృద్ధులకు దుప్పట్లు పంపిణీచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్‌జగన్‌రెడ్డి పాలనలో ప్రజలు అనుభవిస్తున్న అష్టకష్టాలు అనుభవిస్తున్న ప్రజలను ఓదార్చి వారి సమస్యలను తెలుసుకోవడానికి 'యువగళం' పేరుతో సుదీర్ఘపాదయాత్రకు శ్రీకారం చుట్టిన లోకేష్‌బాబుకు అందరి ఆశీస్సులు ఉండాలని కోరారు. కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటు వాణిజ్య విభాగం కార్యదర్శి చిల్లకూరుబాలసుబ్రమణ్యం, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు భాస్కర్‌ముదిరాజ్, వంశీకృష్ణ, అహ్మద్, రఫి తదితరులు పాల్గొన్నారు.

అరాచక ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయి

-చక్రాల.ఉష

శ్రీకాళహస్తి, జనవరి 24 ప్రభాతవార్త

వైకాపా ప్రభుత్వానికి ప్రజలే బుద్ధిచెప్తారని, అరాచక, అవినీతి వైకాపా ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని తిరుపతి పార్లమెంటు తెలుగుదేశంపార్టీ మహిళా అధ్యక్షురాలు చక్రాల.ఉష అన్నారు. తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు నారాచంద్రబాబునాయుడు, జాతీయ కార్యదర్శి నారాలోకేష్‌లు ఇచ్చిన పిలుపుమేరకు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జలసుధీర్‌రెడ్డి సూచనలతో మంగళవారం ఇదేంఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 12వ వార్డు కార్యక్రమం సాగింది. ఈసందర్భంగా ఉష వార్డులోని ప్రతి ఇంటికి వెళ్ళి వారికి పలకరిస్తూ గత ప్రభుత్వంలో నిత్యావసర వస్తువులు, కరెంటు బిల్లులు, ఇసుక, ఇంటి పన్నులు బాదుడు వంటివి వివరించారు. వైకాపా ప్రభుత్వం వచ్చిన తర్వాత నిత్యావసర వస్తువులు, విద్యుత్తు బిల్లులు, ఇసుక, ఇంటి పనులు, మహిళలకు భద్రత, మూడు రాజధానులు కావాలా ఒక్క రాజధాని కావాలా తదితర విషయాలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా వార్డు ప్రజలు వైకాపా ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని విధాలుగా నష్టపోయామని చివరికి అర్హత ఉన్న వారి ఫించన్లు, రేషన్‌కార్డులు కూడా తొలగించారని తెలుగుదేశంపార్టీనాయకుల దృష్టికి ప్రజలు తెచ్చారు. అరాచక వైకాపా ప్రభుత్వానికి ప్రజలు బుద్ధిచెప్పేరోజులు దగ్గరపడ్డాయని మండిపడ్డారు. తొలుత వార్డు నాయకుడు దివంగత సంపత్‌కు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో 12వ వార్డు నాయకులు ఊహ, సంధ్య కేశవ, జైసారథి, మరియు తెదేపా రాష్ట్ర కార్యదర్శి దశరథాచారి, మాజీ మున్సిపల్ వైస్‌ఛైర్మన్‌మిన్నలోరవి, ప్రసాద్‌నాయుడు, డివినారాయణ, టిఎన్ఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి ఉమేష్‌రావు, తెదేపా సాంస్కృతిక విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరుసుబ్రమణ్యం(బుజ్జి), రాష్ట్ర మహిళా కార్యనిర్వాహక కార్యదర్శి బి.రేణుకాదేవి, ప్రసాద్‌రావు, తిరుపతి పార్లమెంటు కోశాధికారి కంటా రమేష్, తిరుపతి పార్లమెంటు రైతు నాయకుడు ప్రకాష్‌నాయుడు, పట్టణ పార్టీ ఉపాధ్యక్షుడు పోలూరుశ్రీనివాసులురెడ్డి, ప్రసాద్‌నాయుడు, సుమతమ్మ, గోపినాథ్, కాసరం రమేష్, వజ్రంకిషోర్, వినయ్, మునికృష్ణ, ప్రతాప్, దిలీప్‌కుమార్, మురళీ, దొరబాబు, బషీర్, ఎంఎస్‌రెడ్డి, గోపినాయుడు, భాస్కర్‌గౌడ్, కిట్టు, దొరబాబు, జిలానీబాషా, మునిరాజయాదవ్, మునికృష్ణా, అస్మత్, రామచంద్రయ్య, కాసరం రమేష్, వజ్రంకిషోర్, మోహన్‌గౌడ్, తీర్థంవెంకటేశ్వర్లు, చాన్‌బాషా, షాజహాన్, గోపి, లోకేష్ మరియు తెలుగుదేశంపార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే గడప..గడపకు

తొట్టంబేడు, జనవరి 24 ప్రభాతవార్త

ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల సమస్యలను తానే స్వయంగా తెలుసుకుంటున్నాని, సమస్యలు పరిష్కరించడమే తమ ధ్యేయమని శాసనసభ్యుడు బియ్యపుమధుసూధన్‌రెడ్డి అన్నారు. గడప గడపకు కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఇలగనూరు గ్రామం మరియు హరిజనవాడల్లో మంగళవారం ఆయన పర్యటించారు. ఈసందర్భంగా పర్యటించిన గ్రామాల్లో ప్రజలు, మండల నాయకులు ఎంఎల్‌ఏకు హారతులిస్తూ ఘనస్వాగతం పలికారు. ఈసందర్భంగా ఎంఎల్‌ఏ ప్రతి ఇంటింటికి వెళ్ళి ప్రజలు, వృద్ధులు, యువత సమస్యలను తెలుసుకుంటూ ముందుకుసాగారు. జగనన్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందుతున్నాయా, లేదా అని తెలుసుకున్నారు. నిరుపేదలకు జగనన్న పథకాలు ప్రతి ఒక్కరికి అందాల్సిన అవసరం ఉందని అర్హులైన ప్రతి ఒక్కరిని గుర్తించి వారికి అందజేయాల్సిన అవసరం వాలంటీర్లను ఆదేశించారు. పిల్లమేడులో పారిశుద్యం అధ్వాన్నంగా ఉందని దీంతో ఇబ్బందులు పడుతున్నామని ఎంఎల్‌ఏ దృష్టికి తెచ్చారు. చేనేత కార్మికులుకు ప్రతి ఏడాది ప్రభుత్వం అందిస్తున్న నగదు అందుతుందా లేదా అని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమేప్రభుత్వలక్ష్యమనితెలిపారు.కార్యక్రమంలోమండల పార్టీ అధ్యక్షుడు ఉన్నం వాసుదేవనాయుడు, జడ్పీటిసి అర్చనాదేవి, జడ్పిటిసి మునిరత్నం, సుబ్రమణ్యంనాయుడు, రమణ య్య నాయుడు, బాలాజీనాయుడు,వైస్‌ఎంపిపిగరటారెడ్డి,వెంకటేశ్వర్లునాయుడు,మోహన్‌నాయుడు, సుబ్ర మణ్యంయాదవ్, భక్తవత్సలం, రాజగోపాల్, బత్తెయ్య, నారాయణ ఆచారి, బాబు, పెంచలయ్య, శీన య్య, ప్రభాకర్, రఘురాం, గాలిరవినాయుడు, ప్రదీప్, నాగేశ్వరరావు, ప్రసాద్, నాగరాజు, సుబ్బ రాయుడు, జనార్ధన్‌నాయుడు, మణి, విజయ్, గోపి, వెంకటరమణారెడ్డి, గురువారెడ్డి, రవినాయుడు, వెంకటయ్య, భాస్కర్‌రెడ్డి,దీపక్‌రెడ్డి,శ్రీనివాసులు,సుబ్రమణ్యం, తిరుపాల్, గురుస్వామినాయుడు, నరసింహనాయుడు, కోటేశ్వరం,ఆటోరామయ్య,నాగరాజుతహశీల్దార్‌సుధీర్‌రెడ్డి,ఎంపిడిఓతరుణాక్షిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విదేశాలనుంచి అప్పుగా తెచ్చిన 100లక్షల కోట్లు ఎక్కడికెళ్లాయి - కేంద్రమాజీ మంత్రి చింతామోహన్

- దేశంలో పెరిగిన ఆర్థిక అసమానతలు.. 75 ఏళ్లలో సాధించింది ఇదేనా..?
- రాష్ట్రంలో సిఎం జగన్ సినిమా క్లోజ్.. లోకేష్‌ను సిఎంగా చూడాలని చంద్రబాబుకు ఉబలాటం !!

కుప్పం, జనవరి 24 ప్రభాతవార్త

కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఇతర దేశాల నుంచి అప్పుగా తెచ్చిన 100లక్షల కోట్ల రూపాయలు ఎక్కడి కెళ్లాయని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ ప్రశ్నించారు. మంగళవారం కుప్పం మండలం కంగుంది, బోదగుట్టపల్లిలో భారత్ జోడో యాత్ర నిర్వహించిన అనంతరం ఆయన కుప్పం ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. దేశంలో ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయని 75 ఏళ్లలో సాధించిన ప్రగతి ఇదేనా అని ప్రశ్నించారు. పేదవాడు మరింత పేదవాడిగా మారుతున్నాడన్నారు. గతంలో నెహ్రూ, ఇందిరాగాంధీలు సైతం అప్పులు తెచ్చి ప్రాజెక్టులు నిర్మించారని భాజపా ప్రభుత్వం తెచ్చిన అప్పులు ఏమయ్యాయో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు పొరసరఫరాల ద్వారా పేదలకు ప్లాస్టిక్ బియ్యం ఇస్తున్నారని పేదలకు ప్లాస్టిక్ బియ్యాను ఎలా పంపిణీ చేస్తారని ప్రశ్నించారు. అసలు జిల్లాల్లో కలెక్టర్లు ఏమయ్యారు అని ప్రశ్నించారు. రాష్ట్రంలో సిఎం జగన్ సినిమా క్లోజ్ అయిందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైకాపాకు 20 సీట్లు మాత్రమే వస్తాయని జోస్యం చెప్పారు.పులివెందుల వైకాపా పాలనలో ఎస్సీ, ఎస్టీలు, ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎవరూ సంతోషంగా లేరని ఇది జగన్ మూడున్నర ఏళ్లలో సాధించిన ప్రగతి అని విమర్శించారు. ముఖ్యమంత్రిగా 14 ఏళ్లు పనిచేసిన చంద్రబాబు తన కుమారుడు నారా లోకేష్‌ను సిఎం చేయాలని ఉబలాట పడుతున్నారన్నారు. కుప్పానికి ఆయన చేసింది ఏమని ప్రశ్నించారు. పేదలకు సరైన పక్కా ఇళ్లు కూడా కుప్పంలో లేవని, రోజూ పదివేలమంది నిరుద్యోగులు ఇతర రాష్ట్రాలకు వెళ్తున్నారని పేర్కొన్నారు. తాను తిరుపతిలో టిడ్కో ఇళ్లు తెచ్చానని, సెజ్‌లు తెచ్చానని ఇలా చంద్రబాబు కుప్పంలో ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గృహ నిర్మాణాలకు బిల్లులు చెల్లించడం లేదన్నారు. లబ్దిదారులు వడ్డీకి అప్పులు తెచ్చి అంతో ఇంతో ఇళ్ల నిర్మాణాలు చేపట్టి తలదాచుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో ఫైనాన్స్ కార్పోరేషన్లు ఏమయ్యాయని ప్రశ్నించారు. గ్రామాల్లో సర్పంచులు వీధి లైట్లు మార్చే స్థితిలో సైతం లేకుండా కన్నీటిపర్యంతమవుతునాళ్ళనారన్నారు. రాష్ట్రంలో విద్యా ప్రమాణాలు పూర్తిగా పడిపోయాయని ఎస్సీ, ఎస్టీల పరిస్థితి అగమ్యగోచర ంగా మారిందన్నారు. రాష్ట్రంలో ఫ్లెక్సీ బ్యానర్లను నిషేధించడం సరికాదన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేసి వంద సీట్లు గెలుచుకోవడం ఖాయమన్నారు. సమావేశంలో డిసిసి అధ్యక్షుడు డా॥ బిఆర్ సురేష్‌బాబు, రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకటరమణబాబు, నేతలు మురుగన్, పళని తదితరులు పాల్గొన్నారు.

రేపు కాణిపాకం ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసం

కాణిపాకం, జనవరి 24 ప్రభాతవార్త:

వసంత పంచమి సందర్భంగా ఈనెల 26న సత్య ప్రమాణాలకు పెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించనున్నట్లు ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశులకు తెలిపారు. వసంత పంచమి సందర్భంగా పిల్లలకు విద్యాభ్యాసంలో ఎటువంటి విఘ్నాలు కలుగకుండా వుండాలని కోరుతూ విఘ్ననాధుడైన గణనాధుని సన్నిధిలో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమంను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక ఆస్థాన మండపం నందు ఉదయం 7.30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు ఈకార్యక్రమంను నిర్వహించన్నుట్లు తెలిపారు. ఈమ పిల్లలకు అక్షరాభ్యాసం చేయించుకునే వారు దేవస్థానంకు 200 రూపాయలు టిక్కెట్ ధర చెల్లించి తమ పూజా సామాగ్రితో కార్యక్రమంలో పాల్గొనవచ్చునని వారు తెలిపారు. ఈకార్యక్రమంను భక్తులు సద్బినియోగం చేసుకోవాలని కోరారు.

అంగన్‌వాడీ వర్కర్లకు పేస్ యాప్‌ను రద్దు చేయాలి - సీఐటీయూ ధర్నా

నగరి, జనవరి 24 ప్రభాతవార్త:

అంగన్‌వాడీ వర్కర్లకు ఫేస్ యాప్‌నఉ రద్దు చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో నగరి ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయ